సంపుటి : 9
సంచిక : 291
మంగళవారం
14 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE

E-PAPER



Contact For Ads:
7579339999

## సినిమా నుంచి రాజకీయాల దిశగా?



ఈ నెల 18న కీలక నిర్ణయం ఉంటుందా?

# రాజకీయాల్లోకి జూనియర్ ఎన్టీఆర్?

## మళ్లీ మొదలైన ఊహాగానాలు!

**హైదరాబాద్ / అమరావతి, విశ్వం వాయిస్ బ్యూరో న్యూస్:**
టాలీవుడ్ స్టార్ హీరో, 'యంగ్ టైగర్' జూనియర్ ఎన్టీఆర్ రాజకీయ ప్రవేశంపై మరోసారి సోషల్ మీడియాలో చర్చలు వాడివేడిగా సాగుతున్నాయి. తరచుగా తెరపైకి వచ్చే ఈ అంశం, తాజాగా ఈ నెల 18వ తేదీని లక్ష్యంగా చేసుకుని జోరుగా ప్రచారంలోకి వచ్చింది. రాజకీయ వర్గాల్లోనూ, నెటిజన్ల మధ్యనూ ఈ ప్రచారం హాట్ టాపిక్‌గా మారింది.

### ఎందుకు ఈ చర్చ? ప్రచారం వెనుక ఉన్న లాజిక్ ఇదే!

ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో వస్తున్న వార్తల ప్రకారం, ఈ నెల 18న జూనియర్ ఎన్టీఆర్ తన రాజకీయ భవిష్యత్తుపై ఏదో ఒక కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

**బీజేపీ వైపు అడుగులా?:** గతంలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలతో ఆయన భేటీ అయిన సందర్భాలను గుర్తు చేస్తూ, ఆయన బీజేపీలో చేరతారనే ఊహాగానాలకు బలం చేకూరుస్తున్నారు.

**కొత్త పార్టీ ఊహలు:** తెలంగాణ రాజకీయాల్లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో, మాస్ ఇమేజ్ ఉన్న ఎన్టీఆర్ సొంత పార్టీ పెడితే బాగుంటుందని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**సోషల్ మీడియా మౌనం:** ఎన్టీఆర్ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో 18వ తేదీ వరకు ఎలాంటి పోస్టులు చేయరనే వార్త ఈ ఊహాగానాలకు ఆజ్యం పోసింది.

### వాస్తవ పరిస్థితులు ఏమిటి?

ప్రస్తుతానికి జరుగుతున్న చర్చలన్నీ కేవలం సోషల్ మీడియా పోస్టులు, విశ్లేషకుల అంచనాలకే పరిమితమయ్యాయి.

1. **అధికారిక ప్రకటన శూన్యం:** ఇప్పటివరకు జూనియర్ ఎన్టీఆర్ గానీ, ఆయన టీమ్ గానీ రాజకీయ ప్రవేశం గురించి కనీసం సంకేతం కూడా ఇవ్వలేదు.
2. **అప్పట్లో క్లారిటీ:** గతంలో కూడా ఇలాంటి ప్రచారం జరిగినప్పుడు, తాను పూర్తిగా సినిమాలకే ప్రాధాన్యత ఇస్తానని ఆయన స్పష్టం చేసినట్లు వార్తలు వచ్చాయి.
3. **టీడీపీ బాధ్యతలు:** తెలంగాణ టీడీపీ బాధ్యతలను ఎన్టీఆర్‌కు అప్పగిస్తారనే ప్రచారానికి కూడా ఇప్పటివరకు ఎలాంటి బలమైన ఆధారాలు లేవు.

### తుది మాట: ఇది కేవలం ప్రచారమే!

సినీ కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్న తరుణంలో జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రావడం అంత సులువైన విషయం కాదని రాజకీయ నిపుణులు చెబుతున్నారు. మారుతున్న సినీ రంగాన్ని, ఓటీటీల ప్రభావాన్ని బేరీజు వేసుకుంటే, ప్రస్తుతానికి ఆయన దృష్టి అంతా సినిమాలపైనే ఉండే అవకాశం ఉంది. ఏది ఏమైనా, దీనిపై స్పష్టత రావాలంటే జూనియర్ ఎన్టీఆర్ స్వయంగా స్పందించే వరకు వేచి చూడాల్సిందే.

---

భోగాపురం ఎయిర్‌పోర్టుకు

## కేంద్ర హోంశాఖ కీలక గుర్తింపు



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కేంద్ర హోంశాఖ కీలక గుర్తింపు ఇచ్చింది. 'ఇమిగ్రేషన్, విదేశీయుల చట్టం-2025' పరిధిలోకి ఈ ఎయిర్ పోర్టును చేర్చింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మిగతా .. 2లో..

'ప్రశ్న రావణ్' కేసులో

## కొనసాగుతున్న దర్యాప్తు

యూట్యూబ్ ఛానల్ సీఈవో గమన, వైసీపీ నేత ఇంద్రసేనపై 5 గంటల విచారణ



**గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** చంద్రబాబు, పవన్ కల్యాణ్ లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, హిందూ దేవుళ్లను కించపర్చడం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ 'ప్రశ్న రావణ్' కేసులో మిగతా .. 2లో..

# 2027 మార్చి నాటికి పోలవరం పనులు పూర్తి

- పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన సీఎం చంద్రబాబు
- అధికారులతో సమీక్ష... మీడియా సమావేశం
- మూడేళ్లలో 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను పూర్తి చేయాలని నిర్ణయం
- ప్రాజెక్టుల కోసం రూ.35,313 కోట్లు కేటాయించనున్న ప్రభుత్వం
- జలధార పనులకు ప్రతి జిల్లాకు రూ.2 కోట్లు విడుదల చేయాలని ఆదేశం
- 1023 సాగునీటి పథకాల పునరుద్ధరణకు ఏపీఎస్ఐడీసీకి బాధ్యతలు




**పోలవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రానికి పోలవరం జీవనాడి అని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఆ ప్రాజెక్టును సందర్శించిన తర్వాత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పనులు జరుగుతున్న తీరును సీఎం తెలుసుకున్నారు. దీంతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాజెక్టులపైనా చంద్రబాబు సమీక్షించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. "2019 నాటికి పోలవరం పనులు 72 శాతం పూర్తయ్యాయి. ఆ తర్వాత ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు. వైకాపా హయాంలో డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయినా గుర్తించలేదు. ప్రస్తుతం 89 శాతం పనులు పూర్తయ్యాయి. అనుకున్న సమయం ప్రకారమే పనులు జరుగుతున్నాయి. స్పిల్ వే రేడియల్ గేట్స్, కాఫర్ డ్యామ్ సహా పలు పనులు పూర్తయ్యాయి. ఆరు నెలల్లోపు పోలవరం కాలువ పనులు, 2027 మార్చి నాటికి మిగతా అన్ని పనులూ పూర్తిచేస్తాం. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే 194 టీఎంసీలు నిల్వ ఉంటాయి. 23.5 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమవుతుంది. 28.5 లక్షల మందికి తాగునీటి సరఫరా జరుగుతుంది. శ్రీశైలం జలాలు రాగానే సెప్టెంబర్ 1న వెలిగొండ ప్రాజెక్టు కూడా ప్రారంభిస్తాం. గత ప్రభుత్వం ఆ ప్రాజెక్టు పూర్తికాకుండానే జాతికి అంకితం చేసింది. నిర్దేశిత సమయం ప్రకారం 36 ప్రాజెక్టులనూ పూర్తిచేస్తాం. దీనికోసం జిల్లాకు అదనంగా రూ.2కోట్లు కేటాయిస్తాం" అని చంద్రబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం బహుళార్ధ సాధక ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సోమవారం పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, అనంతరం అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రాజెక్టు పురోగతి, ప్రభుత్వ లక్ష్యాలను ఆయన వెల్లడించారు. 2026 ఆగస్టు 14న, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఒకరోజు ముందు, ఎడమ ప్రధాన కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలను విడుదల చేసి మిగతా .. 2లో..

పవన్‌ను పరామర్శించిన

## మహారాష్ట్ర సీఎం ఫడణవీస్



**ముంబై, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పరామర్శించారు. భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌ను ఫడ్నవీస్ సోమవారం కలిసి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ కుడి భుజానికి శనివారం సుమారు మూడున్నర గంటల పాటు వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. 2016లో ఆయన భుజానికి గాయమవగా, ఇటీవలి రాజకీయ పర్యటనల్లో అభిమానులు, కార్యకర్తల తాకిడి కారణంగా ఆ గాయం మిగతా .. 2లో..

## ఇది పరస్పర ఒప్పందం

అమెరికాకు ఇరాన్ హెచ్చరిక



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయి. దాడులు ప్రతిదాడులతో ఆ ప్రాంతం దద్దరిల్లుతోంది. ఈ క్రమంలో ఇరాన్ కీలక ప్రకటన మిగతా .. 2లో..

## షాబాద్ నరహంతకుడు రాజ్‌కుమార్ మృతి



**కొత్తూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన షాబాద్ ఆరు హత్యల కేసులో నరహంతకుడు రాజ్‌కుమార్ (29) మృతిచెందాడు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్లలోని ఓ వెంచర్‌లో అతడి మృతదేహాన్ని స్థానికులు మిగతా .. 2లో..

## రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలి



తెలంగాణా సీఎం రేవంత్

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మెట్రో రైలు విస్తరణకు కేంద్ర ప్రభుత్వ మిగతా .. 2లో..

## అమెరికా వాణిజ్య ఒప్పందం.. ఆ వార్తలు అవాస్తవం



కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని భారత్ తిరస్కరించినట్లు వచ్చిన వార్తల్ని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఖండించారు. అవన్నీ తప్పుడు వార్తలని, నిరాధారమైనవని మిగతా .. 2లో..

## టీడీపీలో కొట్టుకున్న తమ్ముళ్లు..!




గోవధ నిషేధ అంశంపై

## విజయ్ ప్రభుత్వానికి సుప్రీంలో ఊరట



**విశ్వం వాయిస్ న్యూస్ :** గోవధ నిషేధ అంశంపై విజయ్ ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. బక్రీద్, ఇతర రోజుల్లో రాష్ట్రంలో గోవధ జరగకుండా చూసుకోవాలని ఇటీవల తమిళనాడు ప్రభుత్వాన్ని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. గోవధ నిషేధానికి సంబంధించి 1976లో ప్రభుత్వ ఉత్తర్వును అమలు చేయాలని తమిళనాడు ప్రభుత్వాన్ని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. వ్యవసాయ మిగతా .. 2లో..

విద్యా వ్యవస్థలో దోపిడీని

## అరికట్టాల్సిన సమయం వచ్చింది



లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత్‌లో విద్యా వ్యవస్థ మోసపూరితంగా మారిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. విద్య పేరిట జరుగుతోన్న దోపిడీని మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# 2027 మార్చి నాటికి పోలవరం పనులు పూర్తి

చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుడతామని కీలక ప్రకటన చేశారు. అక్కడ తాను స్వయంగా జలహారతి ఇచ్చి గోదావరి జలాలకు స్వాగతం పలుకుతానని తెలిపారు.

**గత ప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు**

ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 2019 నాటికి 72 శాతం పనులు తాము పూర్తి చేస్తే, ఆ తర్వాత ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే జరిగాయని ఆరోపించారు. ప్రాజెక్టుపై కక్ష సాధింపు, ఏజెన్సీలను మార్చడం, పీపీఏ సూచనలను పెడచెవిన పెట్టడం వంటి చర్యల వల్ల ప్రాజెక్టు భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు. ముఖ్యంగా, ఎగువ కాఫర్ డ్యామ్‌లో ఖాళీలు వదిలేయడం వల్ల వచ్చిన వరదలకు రూ.440 కోట్లతో నిర్మించిన డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయిందని, దీనిని గుర్తించడంలో గత ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. దీని ఫలితంగా ఇప్పుడు దానికి సమాంతరంగా మరో డయాఫ్రమ్ వాల్‌ను రూ.990 కోట్ల అదనపు వ్యయంతో యుద్ధప్రాతిపదికన నిర్మించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకప్పుడు డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నప్పుడు కొన్ని రోజులు నిద్రపట్టలేదు. రాష్ట్ర జీవనాడికి ఏమైపోతుందోనని మధనపడ్డాను. కానీ దేవుడి ఆశీస్సులు, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రాజెక్టు మళ్లీ గాడిలో పడింది" అని చంద్రబాబు అన్నారు.

**పనుల పురోగతి, భవిష్యత్ కార్యాచరణ**

తాము అధికారంలోకి వచ్చాక పనులను వేగవంతం చేశామని, గత రెండేళ్లలో 15% పనులు పూర్తి చేసి మొత్తం పురోగతిని 89 శాతానికి చేర్చామని చంద్రబాబు వివరించారు. ఇప్పటివరకు రూ.7,100 కోట్లు ఖర్చు చేశామని, కేంద్రం నుంచి మరో రూ.3,835 కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. స్పిల్‌వే, రేడియల్ గేట్లు, కాఫర్ డ్యామ్ పనులు పూర్తయ్యాయని, 50 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునేలా గేట్లను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని, గ్యాప్-1 48 శాతం, గ్యాప్-2 30 శాతం చొప్పున పూర్తయ్యాయని తెలిపారు. భూసేకరణ 94,152 ఎకరాలు పూర్తయిందని, అక్టోబర్ 26 నాటికి 100 శాతం పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**నిర్వాసితులకు అండగా ఉంటాం**

పోలవరం ప్రాజెక్టు కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులకు అన్ని విధాలా అండగా నిలుస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. వారికి న్యాయం చేయడం తన నైతిక బాధ్యత అని పునరుద్ఘాటించారు. ఇప్పటివరకు 17,500 నిర్వాసిత కుటుంబాలను తరలించామని, మార్చి 2027 నాటికి పునరావాస ప్రక్రియను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నిర్వాసితుల కోసం 17,118 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, సొంతగా ఇల్లు కట్టుకునే వారికి లేదా ఇంటి స్థలం కొనుక్కునే వారికి అదనంగా రూ.2 లక్షలు అందిస్తున్నామని తెలిపారు.

**రాష్ట్రవ్యాప్త సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి**

పోలవరంతో పాటు రాష్ట్రంలోని ఇతర సాగునీటి ప్రాజెక్టులపైనా దృష్టి సారించామని చంద్రబాబు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా వచ్చే ఏడాదికి విశాఖపట్నం తాగునీటి కష్టాలు తీరుస్తామని, ఆ తర్వాత వంశధారతో అనుసంధానం చేస్తామని చెప్పారు. ప్రకాశం జిల్లాకు వరప్రదాయిని అయిన వెలుగొండ ప్రాజెక్టు మొదటి టన్నెల్ పనులను పూర్తి చేసి, సెప్టెంబర్ 1న ప్రారంభిస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వం ప్రాజెక్టు పూర్తికాకుండానే ప్రారంభోత్సవాలు చేసి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 36 ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేయడానికి నిర్దిష్ట కార్యాచరణ, ప్రారంభోత్సవ తేదీలతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టులన్నిటినీ పూర్తి చేసి రైతుల కళ్లలో ఆనందం చూడటమే తన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రాజెక్టు పనుల పురోగతిని ఇకపై ప్రతినెలా ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు.

### భోగాపురం ఎయిర్‌పోర్టుకు
## కేంద్ర హోంశాఖ కీలక గుర్తింపు

అధికారిక గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో కేటగిరీ-1 విమానాశ్రయాల జాబితాలో భోగాపురం 39వ స్థానంలోకి చేరింది. కేంద్ర హోంశాఖ నిర్ణయంతో ఈ ఎయిర్‌పోర్టు నుంచి అంతర్జాతీయ విమానాల రాకపోకలకు మార్గం సుగమం కానుంది. ఈ నోటిఫికేషన్‌తో ఇమిగ్రేషన్ చెక్‌పోస్ట్‌గా భోగాపురం ఎయిర్‌పోర్టు గుర్తింపు పొందింది. కేంద్రహోంశాఖ అదనపు కార్యదర్శి నితేశ్‌కుమార్ వ్యాస్ పేరిట ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

### 'ప్రశ్న రావణ్' కేసులో
## కొనసాగుతున్న దర్యాప్తు

ఆంధ్రప్రదేశ్ పోలీసులు దర్యాప్తును మరింత ముమ్మరం చేశారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబ్ ఛానల్ సీఈవో గమన, భవన యజమాని, వైసీపీ నాయకుడు ఇంద్రసేనా చౌదరిలను పోలీసులు రెండో రోజు సుదీర్ఘంగా విచారించారు. సోమవారం గన్నవరం డీఎస్పీ కార్యాలయంలో... డీఎస్పీ నేతృత్వంలోని ప్రత్యేక బృందం వీరిద్దరినీ సుమారు ఐదు గంటల పాటు ప్రశ్నించింది. విచారణ అనంతరం వారిని పంపించివేసిన పోలీసులు, ఈ నెల 17వ తేదీన మరోసారి విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. రెండో రోజు విచారణలో పోలీసులు ప్రధానంగా ఆర్థిక లావాదేవీలు, ఛానల్ నిర్వహణ వెనుక ఉన్న సూత్రధారులపైనే దృష్టి సారించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వివాదాస్పద యూట్యూబర్ రావణ్‌కు, వైసీపీ నేత ఇంద్రసేనా చౌదరికి మధ్య ఉన్న సంబంధాలు ఏమిటి? వారి మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీల వివరాలపై పోలీసులు కూలంకషంగా ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో, ఛానల్ సీఈవోగా గమన పాత్రపైనా అధికారులు ఆరా తీశారు. ఆమె ఎప్పటి నుంచి ఈ బాధ్యతల్లో ఉన్నారు, ఛానల్‌కు వస్తున్న నిధుల మూలాలు ఎక్కడ ఉన్నాయి, తెరవెనుక ఉండి నడిపిస్తున్న అసలు వ్యక్తులు ఎవరు అనే కోణంలోనూ ప్రశ్నలు సంధించారు. గతంలో రావణ్‌ను అరెస్ట్ చేసిన తర్వాత, హైదరాబాద్ మాదాపూర్‌లోని 'ఎలైట్' భవనంలో ఉన్న అతని యూట్యూబ్ ఛానల్ కార్యాలయంలో గన్నవరం పోలీసులు విస్తృత సోదాలు నిర్వహించారు. రావణ్ భార్య సమక్షంలో జరిగిన ఈ తనిఖీల్లో కీలకమైన పత్రాలు, హార్డ్ డిస్కులు, ఇతర ఎలక్ట్రానిక్ ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఆధారాల విశ్లేషణలో లభించిన ప్రాథమిక సమాచారం మేరకే ప్రస్తుతం గమన, ఇంద్రసేనలను విచారిస్తున్నట్లు తెలుస్తోంది. దొరికిన డిజిటల్ డేటా ఆధారంగా ఈ కేసులో మరిన్ని చిక్కుముడులు వీడే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

### పవన్‌ను పరామర్శించిన
## మహారాష్ట్ర సీఎం ఫడణవీస్

తీవ్రతరమైంది. దీంతో వైద్యులు శస్త్రచికిత్స చేయాలని సూచించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని వైద్య బృందం వెల్లడించింది. ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు ఆసుపత్రికి వెళ్లి పవన్‌ను పరామర్శించారు. ఆయనను విశ్రాంతి తీసుకోవాలని కోరుతూ, త్వరగా కోలుకుని ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు పవన్ మూడు వారాల పాటు ఫిజియోథెరపీ తీసుకోవాల్సి ఉంటుంది. ఆరు నెలల తర్వాత ఆయన ఎడమ భుజానికి కూడా వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఫడ్నవీస్ పరామర్శ రాజకీయాలకు అతీతంగా నాయకుల మధ్య ఉన్న సౌభ్రాతృత్వానికి నిదర్శనంగా నిలిచింది. తనను పరామర్శించినందుకు ఫడ్నవీస్‌కు పవన్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఇది పరస్పర ఒప్పందం

చేసింది. ఇరుదేశాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందానికి అమెరికా తూట్లు పొడుస్తోందని, ఒప్పందాన్ని పదే పదే ఉల్లంఘిస్తోందని ఆక్షేపించింది. ఈ పరిస్థితి కొనసాగినంత కాలం ఎంవోయూలో పేర్కొన్న అంశాలను తాము నెరవేర్చే ప్రసక్తే లేదని ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ స్పష్టం చేశారు. ఇరాన్ భూభాగంపై దాడులు కొనసాగితే.. అమెరికా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. "అవతలి వాళ్లు నిబంధనలకు కట్టుబడి ఉంటే.. మేం కూడా ఉంటాం. వాళ్లు అతిక్రమిస్తే.. మేం కూడా అతిక్రమిస్తాం" అని ఇస్మాయిల్ మీడియాతో వ్యాఖ్యానించారు. ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందన్న ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. అమెరికా వైఖరి మారకపోతే తమ దాడులను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. గల్ఫ్ దేశాల్లో అమెరికాకు చెందిన వివిధ స్థావరాలపై ఇప్పటికే ఇరాన్ దాడులు చేస్తున్న తరుణంలో ఈ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది.

## షాబాద్ నరహంతకుడు రాజ్‌కుమార్ మృతి

గుర్తించారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని రాజ్‌కుమార్‌గా నిర్ధరించారు. మృతదేహం పక్కన పాయిజన్ బాటిల్‌ను గుర్తించారు. నిందితుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది. ఓ బాలికను వేధించిన వ్యవహారంలో తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ శుక్రవారం అర్ధరాత్రి ఉన్మాదిగా మారి నరమేధం సృష్టించాడు. తొలుత బాలిక తల్లి, నానమ్మలను కత్తిపోట్లతో కడతేర్చాడు. తర్వాత నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బాలికను గొంతుకోసి చంపేశాడు. అనంతరం ఇంటికెళ్లి భార్య, నిద్రిస్తున్న కన్న బిడ్డల గొంతుకోసి కర్కశంగా హతమార్చాడు. మొత్తం అరగంట వ్యవధిలో మూడు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక, ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారుల్ని కిరాతకంగా అంతమొందించాడు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు 14 ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. హైదరాబాద్-బెంగళూరు హైవేల్లోని హోటళ్లు, లాడ్జీలు, దాబాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. నిందితుడి కుటుంబసభ్యులు, సన్నిహితులను ప్రశ్నించారు. ఈ క్రమంలో సోమవారం పెంజర్లలో రాజ్‌కుమార్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు.

**జీవితంపై విరక్తి కలిగిందంటూ.. రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో..**

మృతికి ముందు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. మృతదేహం పక్కన ఉన్న అతడి మొబైల్ ఫోన్‌లో ఈ వీడియోను గుర్తించినట్లు ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు. రాజ్‌కుమార్‌కు బెట్టింగ్ అలవాటు ఉందని.. దీనికోసం 16 సిమ్‌లు వినియోగించినట్లు చెప్పారు. ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగా అప్పుల బాధతో జీవితంపై విరక్తి కలిగిందని.. ఓ అమ్మాయిని నమ్మి చాలా మోసపోయానని సెల్ఫీ వీడియోలో రాజ్‌కుమార్ పేర్కొన్నాడు. 2.26 సెకన్ల నిడివి గల ఈ వీడియోను మీడియా ప్రతినిధులకు సీపీ చూపించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వీడియో రికార్డు చేసినట్లు తెలిపారు.

## రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలి

సహకారం అవసరమని చెప్పారు. ప్రజాభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలతో సీఎం సమావేశమయ్యారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, కేంద్రం నుంచి సాధించాల్సిన అంశాలపై ఎంపీలకు సీఎం దిశానిర్దేశం చేశారు. "ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణ కొలిక్కి వచ్చింది. కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని దాన్ని పూర్తిచేయాలి. తుమ్మిడిహట్టి, పోర్ట్ కనెక్టివిటీ రోడ్డుకు అనుమతులు సాధించాలి. బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు త్వరగా పూర్తిచేసుకోవాలి. గోదావరి, కావేరి అనుసంధానంతో రాష్ట్రానికి ప్రయోజనం కలుగుతుంది. కేంద్రం సహకరిస్తే అంగీకరించేందుకు ఎలాంటి భేషజాలు లేవు. హైదరాబాద్‌కు ఐఐఎం, మూసీ పునరుజ్జీవానికి కేంద్రం నిధులు వచ్చేలా భాజపా ఎంపీలు కృషి చేయాలి" అని రేవంత్ అన్నారు.

## అమెరికా వాణిజ్య ఒప్పందం.. ఆ వార్తలు అవాస్తవం

కొట్టిపారేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. భారత్, అమెరికా మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన ముసాయిదా ఖరారైందని, సరైన సమయం వచ్చినప్పుడు ఇరుపక్షాలు ఈ ఒప్పందంపై సంతకాలు చేస్తాయని వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ ఇవాళ ప్రకటించారు. దీంతో ఈ ఒప్పందానికి తాత్కాలికంగా బ్రేక్ పడినట్లు వార్తలు వచ్చాయి.దీనిపై పీయూష్ గోయల్ ఎక్స్ వేదికగా స్పందించారు. "ఈ వార్తలు అవాస్తవం. గత జూన్ నెలలో అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమీసన్ గ్రీర్ దిల్లీ పర్యటనకు వచ్చిన సమయంలో అద్భుతమైన చర్చలు జరిగాయి. ఇరు పక్షాలకు లబ్ధి చేకూరేలా, ఇరు దేశాల్లోని వ్యాపారులు, రైతులు, కార్మికులు, వినియోగదారులకు ప్రయోజనాలు చేకూరేలా ఒప్పందం ఉండాలని ఆశిస్తున్నాం. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు మా బృందాలు పూర్తి స్థాయిలో పని చేస్తున్నాయి" అని మంత్రి ఎక్స్‌లో పేర్కొన్నారు.

### గోవధ నిషేధ అంశంపై
## విజయ్ ప్రభుత్వానికి సుప్రీంలో ఊరట


ప్రయోజనాలను పరిరక్షించడానికి, పాల దిగుబడిని పెంచేందుకు గోవధను నిషేధించాలన్నది ఆ ఉత్తర్వుల ఉద్దేశం. దీనిని ఆధారంగా చేసుకొనే హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. వీటిని సుప్రీంకోర్టులో విజయ్ ప్రభుత్వం సవాలు చేసింది. నిర్దిష్ట ప్రదేశాల్లో కొన్ని రకాల గోవుల వధకు చట్టం అనుమతిస్తోందని వాదించింది. అలాంటప్పుడు చట్టపరమైన నిబంధనలకు వ్యతిరేకంగా ఉండే న్యాయపరమైన ఆదేశాలు ఇవ్వడం నిలవవని పేర్కొంది. జంతు సంరక్షణ, వధశాలలకు సంబంధించి తగిన చట్టాలు ఉన్నాయని, కానీ అవి పూర్తి నిషేధాన్ని విధించడం లేదని వెల్లడించింది. ఈ వాదనల అనంతరం సుప్రీం స్టే విధించింది.

### విద్యా వ్యవస్థలో దోపిడీని
## అరికట్టాల్సిన సమయం వచ్చింది

నిలువరించాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ప్రధాని మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. విద్యా వ్యవస్థలో అక్రమాలు జరుగుతున్నప్పటికీ.. ఆ ఇద్దరూ మౌనం వహించారని, జవాబుదారీతనం నుంచి తప్పుకొన్నారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. "అవినీతి, అన్యాయం, పక్షపాత వైఖరి, నిజాయితీ లోపించడం... ఈ నాలుగు పదాలు నేను చెప్తున్నవి కాదు. దేశ వ్యాప్తంగా విద్యార్థులు విద్యా వ్యవస్థను ఉద్దేశించి వాడుతున్న పదాలు. భారత విద్యా వ్యవస్థ ఇప్పుడు మోసపూరితమైన, దోపిడీ యంత్రాంగంగా మారిపోయింది" అని రాహుల్ గాంధీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దాల్సిన విద్యా వ్యవస్థ.. కుటుంబాలను అప్పుల ఊబిలోకి నెట్టేస్తోందని విమర్శించారు. విద్యా వ్యవస్థలోని అవినీతి వల్లే పేపర్ లీకేజీ మాఫియా పురుడు పోసుకుందని, లక్షల మంది విద్యార్థులు ఏళ్లపాటు పడుతున్న కష్టాన్ని ఒక్క దెబ్బతో దోచేస్తోందని అన్నారు. తప్పు చేసిన సంస్థలకు టెండర్లు, అధికారులకు ప్రమోషన్లు వస్తున్నాయి గానీ, శిక్ష మాత్రం.. తమ కలలను సాధించుకోలేక, ఒంటరిగా మిగిలిపోతున్న విద్యార్థులకు పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ఇవన్నీ తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు. జరిగిందేదో జరిగిపోయిందని, ఇప్పుడైనా విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు తనతోపాటు అడుగేయాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. దేశ విద్యా వ్యవస్థలోని సమస్యల పరిష్కారానికి విద్యార్థుల స్వరాన్ని ప్రభుత్వానికి చేరవేసే లక్ష్యంతో రాహుల్ గాంధీ 'ఛాత్రోం కీ గూంజ్' పేరిట సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టిన సంగతి తెలిసిందే. తొలివిడతగా జూన్ 17న రాజస్థాన్‌లోని కోటాలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెండో విడతగా దేహ్రాదూన్‌లో జులై 17న ఈ కార్యక్రమం జరగనుంది.

### అదంతా తప్పుడు ప్రచారం..
## నిరూపిస్తే 5 నిమిషాల్లో రాజీనామా

**గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు**



**గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తాను ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వం, తెదేపాకు వ్యతిరేకంగా కాదని గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల ఆవేదనను మాత్రమే వ్యక్తం చేశానని చెప్పారు. తన వ్యాఖ్యలను సాక్షి మీడియాతో పాటు కొన్ని యూట్యూబ్ ఛానళ్లు వక్రీకరించి తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలోని తన కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఎయిర్‌పోర్టు టెండర్ వ్యవహారంలో తన అనుచరుడికి కాంట్రాక్ట్ ఇప్పించాలని ప్రయత్నించానంటూ ఒక పత్రిక, అనుబంధ మాధ్యమాలు చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని ఖండించారు. తాను టెండర్ ఇప్పించినట్లు, సిఫార్సు చేసినట్లు నిరూపిస్తే ఐదు నిమిషాల్లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని బహిరంగ సవాల్ విసిరారు. ఎయిర్‌పోర్టు అడ్వైజరీ కమిటీ వైస్ ఛైర్మన్‌గా రెండు సంవత్సరాల తర్వాత జరిగిన సమావేశానికి హాజరయ్యానని, మిగిలిన పనులకు టెండర్ ఇవ్వడం, వ్యయం పెరగడం వంటి అంశాలు అక్కడ చర్చకు వచ్చాయని చెప్పారు. విజయవాడ, మచిలీపట్నం ఎంపీలు కూడా దీనిపై ప్రశ్నలు అడిగారని, ప్రజాధనం ఖర్చు అవుతున్నప్పుడు ప్రజాప్రతినిధిగా వివరాలు అడగడం తన బాధ్యతేనని అన్నారు. దీనిని ప్రభుత్వ వ్యతిరేక వ్యాఖ్యలుగా చిత్రీకరించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వంపై అసంతృప్తి ఉంటే నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికే తీసుకెళ్తానని చెప్పారు. మాజీ సీఎం జగన్‌ను ఉద్దేశించి యార్లగడ్డ పలు వ్యాఖ్యలు చేశారు. ఎన్టీఆర్ కుటుంబాన్ని దూషించిన వారిని జగన్ ఖండించి ఉంటే ఆయన రాజకీయ స్థాయి పెరిగేదన్నారు. బూతులు మాట్లాడే నాయకులను ప్రోత్సహించడం వల్లే వైకాపా నష్టపోయిందని, ఇప్పటికైనా అలాంటి వారిని దూరం పెట్టాలని హితవు పలికారు.

### బండ్ల గణేశ్ కుమార్తె వివాహం
## ఏపీ మంత్రి నారా లోకేష్‌కు ఆహ్వానం



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆగస్టు 16న జరగనున్న తన కుమార్తె వివాహ మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ ఆయనకు వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ విషయాన్ని బండ్ల గణేశ్ స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. "తెలుగుదేశం పార్టీ అగ్రనేత, యువతకు కాబోయే నాయకుడు (నెక్స్ట్ జనరేషన్ లీడర్), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ల శాఖ మంత్రి నారా లోకేశ్ గారిని కలవడం జరిగింది. మా కుమార్తె వివాహ వేడుకకు విచ్చేసి, నూతన వధూవరులను ఆశీర్వదించాల్సిందిగా వారిని ఆహ్వానించాను" అని తన పోస్టులో పేర్కొన్నారు. ఈ వివాహ వేడుకకు సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. బండ్ల గణేశ్ కుమార్తె జనని వివాహం పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన చిలుకూరి సూర్యతేజతో ఆగస్టు 16న జరగనుంది. గత మే 3వ తేదీన వీరి నిశ్చితార్థం హైదరాబాదులో ఘనంగా జరిగింది.

### హర్మ్యూజ్‌ను రక్షిస్తాం..
## రుసుము చెల్లించండి

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్**



**వాషింగ్టన్, విశ్వం వాయిస్ న్యూస్ :** హర్మ్యూజ్‌ను మూసివేసినట్లు ఇరాన్ ప్రకటించిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. హర్మ్యూజ్ జలసంధిని ఇకపై అమెరికా తన నియంత్రణలోకి తీసుకుంటుందని వెల్లడించారు. నిర్వహణ బాధ్యతను కూడా అగ్రరాజ్యమే చేపడుతుందన్నారు. అందుకుగానూ, హర్మ్యూజ్ గుండా ప్రయాణించే ప్రతి వాణిజ్య నౌక 20 శాతం ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. "ఇకపై అమెరికా.. హర్మ్యూజ్ జల సంధి సంరక్షకుడిగా వ్యవహరిస్తుంది.ఈ అత్యంత సున్నితమైన ప్రాంతానికి రక్షణ, నౌకలకు భద్రత కల్పిస్తున్నందుకు గానూ న్యాయబద్ధంగా వాణిజ్య నౌకలో తరలిస్తున్న సరకులో 20 శాతాన్ని అమెరికాకు చెల్లించాలి. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది" అని ట్రంప్ పోస్టు చేశారు. అలాగే ప్రస్తుతం హర్మ్యూజ్ తెరిచే ఉందని ట్రంప్ తెలిపారు. అయితే, మునుపటిలాగే ఇరాన్‌కు చెందిన ఓడల రాకపోకలను అమెరికా దిగ్బంధిస్తుందని అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్ర స్థాయిలో స్పందించింది. హర్మ్యూజ్ నిర్వహణ విషయంలో అమెరికా చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఇరాన్ మిలిటరీ కమాండ్ అధికార ప్రతినిధి స్పష్టం చేశారు. హర్మ్యూజ్ అంశంపై అమెరికాతో సహకరించడాన్ని 'యుద్ధ చర్య'గా పరిగణిస్తామని గల్ఫ్ దేశాలను హెచ్చరించారు. మరోవైపు అమెరికా దళాల శత్రుపూరిత చర్యలను కారణంగా చూపిస్తూ.. జలసంధిని పూర్తిగా మూసివేసినట్లు ఇరాన్ పర్షియన్ గల్ఫ్ స్ట్రెయిట్ ఆథారిటీ (పీజీఎస్ఏ) ఎక్స్‌లో ప్రకటించింది. పరిస్థితులు కుదుటపడిన తర్వాత, అన్ని దరఖాస్తులు పరిశీలించి.. అనుమతుల ప్రక్రియను తిరిగి ప్రారంభిస్తామని వెల్లడించింది.

# ఎడిటర్ వాయిస్

## టీడీపీలో కొట్టుకున్న తమ్ముళ్లు..
## కొత్త ఇన్‌ఛార్జి పదవుల కోసం కొట్లాట!

తిరుపతి వేదికగా పుంగనూరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల టీడీపీ కార్యకర్తల సమావేశంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. తంబళ్లపల్లె నియోజకవర్గం ఇంచార్జి నియామకంపై సమావేశం జరగగా, పుంగనూరు ఇంచార్జిని మార్చాలంటూ ఆ నియోజకవర్గానికి చెందిన కార్యకర్తలు చేరుకున్నారు. దీంతో సమావేశంలో తీవ్ర గందరగోళం చోటుచేసుకుంది. తంబళ్లపల్లె నియోజకవర్గం ఇంచార్జిగా పనిచేసిన దాసరపల్లె జయచంద్రారెడ్డిని ములకలచెరువు మద్యం కల్తీ కేసులో ఆరోపణలతో తొలగించారు. ఆయన స్థానంలో కొత్తవారికి బాధ్యతలు అప్పగించేందుకు కార్యకర్తల అభిప్రాయాలను తీసుకోవాల్సిందిగా అధిష్టానం మంత్రులు మండిపల్లి రామప్రసాద్ రెడ్డి, బీసీ జనార్ధనరెడ్డికి బాధ్యత అప్పగించింది. అయితే మంత్రుల సమక్షంలోనే కార్యకర్తలు కొట్లాటకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు కార్యకర్తలు తీవ్ర గాయాల పాలయ్యారని చెబుతున్నారు.

వాస్తవానికి తిరుపతిలో తంబళ్లపల్లె నియోజకవర్గ ఇంచార్జి ఎంపికపై సమావేశం జరగాల్సివుండగా, పుంగనూరు కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. దీంతో సమావేశం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. అయితే కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మంత్రి మండపల్లి రామప్రసాద్ రెడ్డి తొలుత తంబళ్లపల్లి కార్యకర్తల అభిప్రాయ సేకరణకు సిద్ధమయ్యారు. ఈ సమయంలో జయచంద్రారెడ్డి అనుచరులు పెద్ద ఎత్తున గుమికూడా తమకు ఫోన్లు చేయకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇంచార్జి పదవి ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ అనుచరులు వారితో ఘర్షణకు దిగారు. ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి కొట్లాట చోటుచేసుకుంది. దీంతో సమావేశం రసాభాసగా మారింది.

మరోవైపు సోమవారం జరిగే కార్యకర్తల అభిప్రాయ సేకరణకు తన అనుచరులకు ఫోన్లు రాలేదని, నిజమైన కార్యకర్తలను పార్టీ పక్కన పెడుతోందని ఆరోపిస్తూ ఆదివారం నాడే మాజీ ఇంచార్జి జయచంద్రారెడ్డి ఎక్స్ వేదికగా సెల్ఫీ వీడియో విడుదల చేశారు. పార్టీ ఇంచార్జి నియామకంలో అసలైన కార్యకర్తల అభిప్రాయాలకు విలువ ఇవ్వడం లేదని సంచలన ఆరోపణలు చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలు నిరుత్సాహం చెందొద్దని, కోవర్టుల నుంచి పార్టీని కాపాడుకోవాలంటూ ఆయన వీడియోలో కోరారు.

తంబళ్లపల్లి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ వర్గానికి జయచంద్రారెడ్డి వర్గానికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. గత ఎన్నికల సమయంలో శంకర్ యాదవ్ ను కాదని వైసీపీ నుంచి వచ్చిన జయచంద్రారెడ్డికి టీడీపీ అధిష్టానం టికెట్ కట్టబెట్టింది. అప్పటి నుంచి ఇరువర్గాల మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు కొనసాగుతున్నాయని పార్టీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ములకలచెరువు మద్యం కల్తీ వ్యవహారంలో జయచంద్రారెడ్డిపై ఆరోపణలు రాగా, పార్టీ అధిష్టానం ఆయనపై వేటు వేసింది. తాజాగా శంకర్ యాదవ్ కు మళ్లీ ఇంచార్జిగా నియమించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయనే అనుమానంతో ఆయన అనుచరులు గొడవకు దిగారని చెబుతున్నారు. మొత్తానికి మంత్రుల సమక్షంలోనే కార్యకర్తలు బాహాబాహీకి దిగడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్


# క్రైమ్ వాయిస్

## విద్యుత్ తీగ తగిలి రైతు మృతి



**కడప, విశ్వం వాయిస్ న్యూస్ :** బ్రహ్మంగారిమఠం మండలం మద్ది రెడ్డి పల్లెలో వ్యవసాయ మోటారు మరమ్మతులు చేపట్టే వ్యక్తి ప్రమాదం జరిగింది. మోటర్ పైపులను తీస్తూ విద్యుత్ తీగ తగిలి రైతు రమణయ్య మృతి మరో వ్యక్తి నాగేశ్వర్ రెడ్డికి గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని అంబులెన్స్‌లో స్థానిక ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి బ్రహ్మంగారిమఠం పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతి చెందిన వ్యక్తిని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## మైదుకూరులో విషాదం - గుర్తుతెలియని వృద్ధుడి మృతి



**మైదుకూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మైదుకూరు పట్టణంలో శనివారం రాత్రి ఒక విషాదకర ఘటన చోటుచేసుకుంది. స్థానిక వనిపెంట రోడ్డులోని శ్రీనివాస కళ్యాణమండపం ప్రక్కన ఉన్న ఒక అరుగుపై ఆశ్రయం పొందుతున్న గుర్తుతెలియని వృద్ధుడు (యాచకుడు) మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... గత కొంతకాలంగా సదరు వృద్ధుడు (సుమారు 65 సంవత్సరాలు) ఆ ప్రాంతంలోనే యాచిస్తూ, రాత్రి వేళల్లో అక్కడ ఉన్న అరుగుపై పడుకునేవాడు. ఈ క్రమంలో శనివారం (12/07/2026) అర్ధరాత్రి సమయంలో అతను చనిపోయి ఉండటాన్ని స్థానికులు గమనించారు. మరణానికి గల కారణాలు స్పష్టంగా తెలియరాలేదు. తీవ్రమైన అనారోగ్య సమస్యల వల్లగానీ, లేదా మరేదైనా ఇతర కారణాల వల్లగానీ అతను రాత్రి నిద్రలోనే కన్నుమూసి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. మృతునికి సంబంధించిన పేరు, ఊరు లేదా బంధువుల వివరాలు ఏవీ తెలియరాలేదు. ఈ ఘటనపై మైదుకూరు అర్బన్ పోలీసులు ప్రాథమిక సమాచారాన్ని సేకరించారు. మృతి చెందిన వ్యక్తి అనాథ కావడంతో, మైదుకూరు అర్బన్ ఇన్స్పెక్టర్ గారి ఆధ్వర్యంలో చట్టపరమైన నిబంధనల ప్రకారం మృతదేహాన్ని తదుపరి అంత్యక్రియల నిమిత్తం మైదుకూరు మున్సిపాలిటీ అధికారులకు అప్పగించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## తిరుపతి జిల్లాలో డ్రగ్స్ కలకలం



### డ్రగ్స్ కేసులో టిటిడి ఉద్యోగి అరెస్ట్

**విశ్వం వాయిస్ న్యూస్ :** గోవిందరాజ స్వామి ఆలయం అర్చక భవన్‌లో జూనియర్ అసిస్టెంట్ పనిచేస్తున్న రాహుల్ యాదవ్ అరెస్ట్. ఈనెల 10న రేణిగుంట పోలీసులు అరెస్ట్ చేసిన డ్రగ్స్ కేసులో 3 నిందితులు అరెస్ట్. వారి వద్ద నుంచి 3 లక్షలు విలువైన 63 గ్రాముల మెత్ స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులకు డ్రగ్స్ సరఫరా.. అరెస్ట్ అయిన వారిలో టిటిడి ఉద్యోగి, ఇంజనీరింగ్ స్టూడెంట్ ఉండటం పై అనేక అనుమానాలు. టీటీడీ ఉద్యోగి రాహుల్ యాదవ్ అరెస్ట్ తో సన్నిహిత ఉద్యోగుల్లో ఆందోళన. పోలీస్ విచారణలో డ్రగ్స్ సరఫరా, సేవిస్తున్న వారి గుట్టు లాగుతున్న పోలీసులు. డ్రగ్స్, గంజాయి సేవిస్తున్న వారికి బయో చెక్ టెస్ట్ లు పోలీసులు నిర్వహిస్తున్నారు.

## రైల్లో ప్రయాణికుడి మొబైల్ ఫోన్‌ను లాక్కోవడానికి ప్రయత్నించిన ఓ దొంగ..



**విశ్వం వాయిస్ న్యూస్ :** రైలు కిటికీకే వేలాడుతూ దాదాపు 9 కి.మీ. ప్రయాణించిన ఘటన ఇది. బిహార్‌లోని మాన్సి రైల్వే స్టేషన్‌లో జనహిత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆగి ఉండగా.. కిటికీ పక్కన కూర్చున్న ఓ ప్రయాణికుడు మొబైల్ ఫోన్ చూస్తుండగా ఓ దొంగ కిటికీ బయట నుంచి ఫోన్‌ను లాక్కుని పరారయ్యేందుకు ప్రయత్నించాడు. పక్కనే ఉన్న ప్రయాణికులు వెంటనే దొంగ చేతిని గట్టిగా పట్టుకున్నారు. రైలు కదలడంతో నిందితుడు రైలు కిటికీ బయట వేలాడుతూ ఖగారియా రైల్వే స్టేషన్ వరకు సుమారు 9 కి.మీ. దూరం ప్రయాణించాడు. చివరకు పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.

## నిర్మల్ సర్పంచ్ సూసైడ్



**నిర్మల్, విశ్వం వాయిస్ న్యూస్ :** నిర్మల్ జిల్లా తానూర్ మండలం బోరిగావ్లో తీవ్ర విషాదం నెలకొంది. సర్పంచ్ పల్లె జ్యోతి సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలా లేక మరేదైనా కారణమా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

'సర్' వెరిఫికేషన్ పేరుతో

## పుస్తెలతాడు చోరీ

### యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘటన



**బీబీనగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** 'సర్' వెరిఫికేషన్ పేరుతో మాయమాటలు చెప్పి మహిళ మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడు దోచుకెళ్లిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి స్వామి-ఆండాళు దంపతుల ఇంటికి ఉదయం 10:30 గంటల సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు సర్ వెరిఫికేషన్ సిబ్బంది పేరుతో వచ్చారు. సర్ కోసం ఫొటో తీయాలని, ఫొటోలో కనిపించకుండా మెడలో ఉన్న పుస్తెలతాడు తీయాలని సూచించగా ఆండాళు తీసి భర్త స్వామి చేతికి ఇచ్చారు. అనంతరం దరఖాస్తు ఫారాన్ని సమీపంలోని ఆలయం వద్ద ఉన్న అధికారుల దగ్గర పూర్తి చేయాలని చెప్పి మహిళను అక్కడికి తీసుకెళ్లారు. మళ్లీ వస్తామని మహిళకు చెప్పి ఇద్దరూ ఆమె ఇంటికి వచ్చారు. పక్షవాతంతో బాధపడుతున్న స్వామి ఇంట్లో కూర్చున్న చోటనే ఆ పుస్తెలతాడు ఉంచగా దాన్ని తీసుకుని నిందితులు పరారయ్యారు. నోటమాట రాని స్వామి అరవలేకపోయారు. కాసేపటికి ఆండాళు ఇంటికి రాగా జరిగిన విషయం తెలిసింది. దీంతో తాము మోసపోయామని గుర్తించి వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

పోలీసుల ఎదుట లొంగిపోయిన

## మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడు



**పలాస, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. న్యాయవాదులతో కలిసి వచ్చి శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ పీఎస్‌లో లొంగిపోయాడు. కాశీబుగ్గలో ఈ నెల 10న జరిగిన బైక్ ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య (45) మృతికి ఆరవ్ కారణమని పోలీసులు గుర్తించారు. అతివేగంతో బైక్ నడిపి ఢీకొట్టినట్లు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన రోజు రాత్రి 9.07 గంటల సమయంలో ఆరవ్ ఒక్కడే బంకుకు వెళ్లి బైక్‌లో పెట్రోల్ పోయించుకున్నట్లు సీసీటీవీ ఫుటేజీ దృశ్యాల విశ్లేషణ ద్వారా పోలీసులు తేల్చారు. తర్వాత కొద్దిసేపటికే పెట్రోల్ బంకు నుంచి 500 మీటర్ల దూరంలోనే ఈ ప్రమాదం జరిగినట్లు నిర్ధరించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోకముందే ఆరవ్‌ను అక్కడినుంచి ఓ కారులో తరలించేసినట్లు గుర్తించారు. ఆయా దృశ్యాల సీసీటీవీ ఫుటేజీని స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆరవ్‌ను నిందితుడిగా చేర్చాల్సిన పోలీసులు.. తొలుత ఈ కేసు నుంచి అతన్ని తప్పించేశారు. ఆరవ్ బదులుగా అతని స్నేహితుడు, అప్పలరాజు ప్రధాన అనుచరుడి కుమారుడైన సిద్ధార్థ త్యాడిని నిందితుడిగా చేర్చారు. అతన్ని వెంటనే అదుపులోకి తీసుకుని స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపేశారు. రెండు రోజులుగా ఈ వ్యవహారాన్ని కప్పిపెట్టేందుకు యత్నించారు. ఇదంతా రచ్చకెక్కడం, పోలీసుల తీరుపై విమర్శలు రావటంతో ఆదివారం దర్యాప్తు చేసి... బైక్ నడిపింది, యాక్సిడెంట్ చేసింది, దానయ్య మృతికి కారణమైంది అప్పలరాజు కుమారుడేనని తేల్చారు. దీనిపై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనం ద్వారా మరిన్ని విషయాలు వెలుగులోకి రావడంతో పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మాజీ మంత్రి కుమారుడు ఆరవ్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు.

## ఈ ఎర్రటి దుంపను చిన్నచూపు చూడకండయ్యా..?

### అది మీకు పెద్ద కాపు లెక్క





**బీట్‌రూట్ అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది**

"క్యాన్సర్‌తో పోరాడటం, రక్తపోటును తగ్గించడం, వ్యాయామ సామర్థ్యాన్ని పెంచడం, జీర్ణక్రియను మెరుగుపరచడం వంటి వాటిలో ప్రధానమైనవి. ఇందులో నైట్రేట్లు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. **అయితే, కిడ్నీలో రాళ్లు ఉన్నవారు బీట్‌రూట్‌ను తినడం మానుకోవాలి.**"

### హెల్త్ వాయిస్

### బీట్‌రూట్ అంటే..

బచ్చలికూర, పాలకూర కుటుంబానికి చెందిన ఈ దుంపల ఆకులు, గడ్డలు రెండూ ఆరోగ్యానికి మంచివే. దీని ఆకులు కాస్త చేదుగా అనిపించినా, రూట్ మాత్రం తియ్యగా ఉంటుంది. ఎర్రటి బీట్‌రూట్‌లో క్యాన్సర్‌తో పోరాడే బీటాసయనిన్ ఎక్కువగా ఉంటుంది. బీట్‌రూట్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ మరియు యాంటీ ఆక్సిడెంట్ గుణాలు సమృద్ధిగా ఉన్నాయి.

**పోషక విలువలు (100 గ్రాముల పచ్చి బీట్‌రూట్‌లో)**

| 36 క్యాలరీలు | 7g ప్రోటీన్ | 1g కొవ్వులు | 6g కార్బోహైడ్రేట్స్ | 5g ఫైబర్ |
|---|---|---|---|---|
| 380mg పొటాషియం | 150mcg ఫోలేట్ | ఇందులోని అధిక ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపర్చుంది. అధిక నైట్రేట్ శాతం రక్తపోటును తగ్గిస్తుంది. | | |

### ఐదు ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలు

**1 యాంటీ క్యాన్సర్ కారకాలు**
బీట్‌రూట్‌లో లభించే బీటాసయనిన్ బ్లాడర్ క్యాన్సర్ లాంటి వివిధ క్యాన్సర్ల నిర్మూలనకు సహకరిస్తుంది.

**2 రక్తపోటు తగ్గిస్తుంది**
నైట్రేట్లు రక్తనాలాలను రిలాక్స్ చేసి రక్త సరఫరాను మెరుగుపరుస్తాయి. ధమనుల దృఢత్వాన్ని పెంచి రక్తపోటును తగ్గిస్తాయి. గుండెజబ్బులు, గుండెపోటు నుంచి రక్షణ కల్పిస్తాయి.

**3 మెరుగ్గైన వ్యాయామ ఫలితాలు**
బీట్‌రూట్ జ్యూస్ శరీరంలో శక్తి స్థాయిలను పెంచి వ్యాయామ సామర్థ్యాన్ని మెరుగు పరుస్తుంది. క్రీడాకారులు తమ డ్రింక్స్‌లో చేర్చుకుంటున్నారు.

**4 కండరాలు రిలాక్స్ అయ్యేలా చేస్తుంది**
వ్యాయామం తరువాత కండరాల రికవరీ సహాయం. నైట్రేట్స్ కండరాల కణాల్లో ఆక్సిజన్‌ను పెంచి రిలాక్సేషన కలిగిస్తాయి.

**5 జీర్ణక్రియ మెరుగుపడుతుంది**
గ్లూటామైన్, ఫైబర్ సమృద్ధిగా ఉండటం వల్ల జీర్ణక్రియ వ్యవస్థ మెరుగుపడుతుంది. 10 అతంత శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్ కూరగాయల్లో బీట్‌రూట్ ఒకటి.

### యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు

బెటాలైన్ సమ్మేళనాలు అత్యధిక యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ సామర్థ్యాలను కలిగి ఉంటాయి. ఇది కాల్ప దెబ్బతినకుండా కాపాడి, వయసుతో వచ్చే జబ్బులు, గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్‌పై పోరాడేందుకు సహాయపడతాయి.

### బీట్‌రూట్ అందరికీ సురక్షితమేనా?

- కొంతమందికి బీట్‌రూట్ తిన్న తరువాత మూత్రం లేదా మలం ఎర్రగా లేదా గులాబీ రంగులో వస్తుంది. దీనిని బీటూరియా అంటారు. ఇది హానికరం కాదు.
- క్యాస, బీట్‌రూట్‌లో ఆక్సిలేట్ అనే సహజంగా లభించే రసాయనాలు ఉన్నాయి.
- కిడ్నీలో రాళ్లు పర్చడట లాంటి సమస్య ఉన్నవారు ఆక్సిలేట్ అధికంగా ఉండే బీట్‌రూట్‌ను తినడం మానేయాలి. ఎందుకంటే అధిక ఆక్సిలేట్ కిడ్నీలో రాళ్లు పర్చడటానికి కారణం కావచ్చు.

### బీట్‌రూట్‌ను ఇలా తీసుకోవచ్చు

రాగా సలాడ్‌లో | జ్యూస్‌గా | సూప్‌లో | కూరల్లో | ఉప్మా, పొంగల్‌లో

**గమనిక**
ఏది ఎక్కువైనా హానికరమే. రోజుకు 100-150 గ్రాముల బీట్‌రూట్ సరిపోతుంది.

**ఎర్రటీ బీట్‌రూట్.. ఆరోగ్యానికి బీట్‌రూట్!**

# విశ్వం వాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




మంగళవారం, 14 జూలై, 2026

4

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత www.viswamvoice.com


### పోలవరం హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టు పనులను

# పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

### పునరావాస పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష







**దేవీపట్నం/పోలవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం పోలవరం బహుళార్థసాధక ప్రాజెక్టు పరిధిలోని 960 మెగావాట్ల పోలవరం హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టు (పీహెచ్‌పీపీ) పనులను పరిశీలించారు. దేవీపట్నం మండలం అంగులూరు వద్ద నిర్మాణంలో ఉన్న పవర్‌హౌస్‌ను సందర్శించి, జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్టు అధికారులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులతో పోలవరం ప్రాజెక్టు సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు నిర్మాణం, హెడ్‌వర్క్స్, హైడ్రో పవర్ ప్రాజెక్టు, పునరావాసం, పునరావాస కాలనీల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, నిర్వాసిత కుటుంబాలకు అందిస్తున్న సౌకర్యాలు తదితర అంశాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమగ్రంగా సమీక్షించారు. ప్రాజెక్టు పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ పోలవరం




జిల్లాలో చేపడుతున్న పునరావాస కార్యక్రమాల పురోగతిని ముఖ్యమంత్రికి వివరించారు. మోడల్ పునరావాస కేంద్రాల్లో చేపడుతున్న గృహ నిర్మాణాలు, రహదారులు, తాగునీరు, విద్యుత్, విద్యాసంస్థలు, ఆరోగ్య కేంద్రాలు తదితర మౌలిక వసతుల కల్పనపై వివరించారు. నిర్వాసిత కుటుంబాలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమీక్ష సమావేశంలో పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ఒకే ఆధార్ నంబర్‌తో బహుళ విద్యుత్ సేవా కనెక్షన్లు

# గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి

### ఆధార్ సర్వీస్ లింకేజీ సవరణలకు అన్ని ఈఆర్‌ఓ కార్యాలయాలలో తగిన సిబ్బందిని నియమించాలి

### జిల్లా కలెక్టర్‌కి జనతా వారధి బృందం వినతి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒకే ఆధార్ నంబర్ తో బహుళ విద్యుత్ సేవా కనెక్షన్లు గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కి బిజెపి జనతా వారధి బృందం విజ్ఞప్తి చేసింది. ఈమేరకు జిల్లా కలక్టరేట్ లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్, రెవె న్యూ క్లినిక్‌లో జనతా వారధి కో- కన్వీనర్ స్వామి సూర్యకిరణ్, యానాపు ఏసు, మీనాక్షి రెడ్డి, బిజెపి నాయకులు శివరామకృష్ణ, పల్నాడు, శేషాద్రి తదితరులు వినతి పత్రం సమర్పించారు. గతంలో జరిగిన పరిపాలన నిర్లక్ష్యం కారణంగా ఒకే ఆధార్ నంబర్కు పలువురు విద్యుత్ వినియోగదారుల సేవలు అనుసంధానం అయిపో యాయని, ఫలితంగా అర్హులైన పేద, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పెన్షన్లు, ఇతర ప్రభుత్వ సేవలకు దూరమ వుతున్నారని వారు పేర్కొన్నారు. ప్రత్యేక డ్రైవ్ ద్వారా సమస్య పరిష్కరించాలని, వినియోగదా రుల సేవలను మెరుగుపరచాలని కోరారు. బాధితుల నుండి కేవలం దరఖాస్తు స్వీకరించి, ఇతర వినియోగదారుల ఆధార్ వివరాలు అడగకుండా శాఖే విచారణచేసి తప్పులను సరిచేయాలని కోరారు.ఆధార్ సర్వీస్ లింకేజీ సవరణలు, వినియోగదారుల వివరాల ధృవీకరణ, రికార్డుల సరిదిద్దడం కోసం అన్ని ఈఆర్‌ఓ కార్యాలయాలలో తగిన సిబ్బందిని తక్షణమే నియమించాలని కోరారు. ఇతర కార్యాలయాలకు బదిలీ చేసిన అవసరమైన సిబ్బందిని తిరిగి ఈఆర్‌ఓ లలో నియమించడం గానీ, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయడం గానీ చేయాలనీ కోరారు. ఈ సమస్య పరిష్కారం అయ్యే వరకు సంబంధిత కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పెన్షన్లు, ఇతర అర్హతలను నిలిపివేయకుండా తాత్కాలిక రక్షణ కల్పించాలని కోరారు. అలాగే సబ్సిడీ విద్యుత్ సరిగ్గా అమలు చేయడం లేదని, టారిఫ్ లు మార్చడం లేదని, ఈ కారణంగా ఆక్వా రైతులు, నాయీ బ్రాహ్మణులు, స్వర్ణకారులు, వడ్రంగులు, పేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు నష్టపోతున్నాయని పేర్కొన్నారు. దీనిపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# వైద్య విజ్ఞానంపై అవగాహన సదస్సు


**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ది ఏపీ స్టేట్ బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాజమహేంద్రవరం నగర శాఖ ఆధ్వర్యంలో స్థానిక లాలాచెరువు వద్ద ఉన్న ఏ ఆర్ కె ఎమర్జెన్సీ & మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు.హాస్పిటల్ అధినేతలు డాక్టర్ పితాని రామకృష్ణ,డాక్టర్ పెదమల ఆదిత్యాయ, వారి వైద్య బృందం డాక్టర్ కిరిటి,డాక్టర్ వినీత సింగ్ ద్వారా సభ్యులకు ప్రథమ చికిత్స పై వైద్య విజ్ఞాన అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు లంక సత్యనారాయణ, రాష్ట్ర గౌరవ సలహాదారులు ఆకాశం గౌరీష్ బాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కన్నాబత్తుల శ్రీనివాస్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పక్కుర్తి సత్యనారాయణ, కార్యదర్శి డి రాంబాబు, ఉపాధ్యక్షులు ఎం. వి.వి సత్యనారాయణ, కోశాధికారి కె వి ఎస్ ఆంజనేయులు, వివిధ మండలాల నుంచి నాయకులు పాల్గొన్నారు.ఈ అవగాహన సదస్సు లో 120 మంది సంఘ సభ్యులు పాల్గొన్నారని




రాజమండ్రి నగర శాఖ అధ్యక్ష కార్యదర్శి కోశాధికారి వి బాలకృష్ణ, వివి ప్రసాద్ బాబు, వి శివశంకర్, వారి కార్యవర్గం ఒక ప్రకటన తెలియజేశారు.

# ప్రజా సానుకూలత పెంచండి

### అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ - పీజీఆర్ఎస్ ద్వారా 19 అర్జీలు స్వీకరణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం చూప కుండా, నాణ్యమైన పరిష్కారం అందించి.. ప్రజలలో సానుకూలతను పెంచాలని అధికారులను అదనపు కమిషనర్ పి.వి.రామ లింగేశ్వర్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 19 అర్జీలు రాగా వీటిలో ఇంజనీరింగ్ కి సంబంధించి 8, రెవెన్యూకి సంబంధించి 1, టౌన్ ప్లానింగ్ కి సంబంధించి 6, పబ్లిక్ హెల్త్ కి సంబంధించి 1, మెప్మాకు సంబంధించి 1, వార్డు సచివాలయాలకు సంబంధించి 1, పింఛన్లకు సంబంధించి ఒకటి ఉన్నాయి. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సేవలపై ప్రజల సంతృప్తిస్థాయిని పెంచేందుకు అన్ని విభాగాల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.ఫిర్యాదుదారునితో తప్పనిసరిగా మాట్లాడాలని, దాని వల్ల చాలావరకు అర్జీలను పరిష్కరించేందుకు, సమస్యను పూర్తిగా అర్థం చేసుకునేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ప్రజలకు స్పష్టంగా, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పరిష్కారం ఉండాలని.. కనుక సమస్యను మూలాల వరకు పరిశీలించి, శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. తమ విభాగానికి సంబంధంలేని దరఖాస్తు తమకు వచ్చిన పక్షంలో, దానిని సంబంధిత విభాగానికి పంపించాలి తప్ప మూసివేయకూడదని స్పష్టం చేశారు. అలాగే పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం ఎట్టిపరిస్థితుల్లోనూ నిర్ణీత గడువు దాటకూడదని తెలియజేశారు.కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి, సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి, మేనేజర్ అబ్దుల్ మలిక్, రెవిన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

### సీతానగరం మండల అభివృద్ధికి

# బిజెపి ఆధ్వర్యంలో ర్యాలీ

### బిజెపి సీనియర్ నాయకులు ఏపీఆర్ చౌదరి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం పోలవరం ప్రాజెక్టు వరకు బిజెపి కేంద్ర మంత్రులు, రాష్ట్రమంత్రులు, ఎంపి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ర్యాలీ ఉంటుందని బిజెపి సీనియర్ నాయకులు ఏపీ ఆర్ చౌదరి తెలిపారు. సీతా నగరం మండల బిజెపి అధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి నివాసం వద్ద జరిగిన మీడియా సమావే శంలో సీనియర్ నాయకులు నీరుకొండ వీరన్న చౌదరితో ఆయన కలిసి మాట్లాడుతూ గోదావరి ఎడమ వైపున నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్టు సందర్శించండి జరు గుతుందని పెర్కొన్నారు. ర్యాలీలో భాగంగా పట్టిసీమ, గండిపోచమ్మ, మహానంది, రామవరపు ఆవ పర్యాటక అభివృద్ధికి దోహదపడుతుం దని చెప్పారు. ఎడమగట్టు గోదా వరి క్యారిడార్ పర్యాటక రంగంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. మధుర పూడి ఎయిర్ పోర్టు నుండి కోరుకొండ, సీతానగరం నుండి పురుషోత్తపట్నం మీదుగా పోలవరం చేరుకోవచ్చని, వ్యవసాయం, పర్యాటక, పారిశ్రామిక రంగానికి సీతానగరం మండలం అనువుగా ఉందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి బిజెపి, ఎన్డీఏ ప్రభుత్వాలు కట్టుబడ్డాయని అందుకే ప్రజలంతా ర్యాలీలో భాగస్వామి కావాలని ఈ సంద ర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జ్ అడపాల, బిజెపి జనరల్ సెక్రెటరీ నాళం లక్ష్మణరావు కండవల్లి సాయి,మద్దాల కొండ లరావు, దాసరి సుబ్బారావు సాంబేలు బాలయోగి, పరబనాగ ఆశిష్, కరోతు లక్ష్మి, కోట కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

### ముక్కామల-ఈదరపల్లి ప్రధాన పంట కాలువ

# రివిట్మెంట్ వాల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ముక్కామల నుంచి ఈదరపల్లి వరకు జాతీయ రహదారి-216ఈకు ఆనుకుని ఉన్న ప్రధాన పంట కాలువ రివిట్మెంట్ వాల్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సిరిపల్లి వద్ద జిల్లా కలెక్టర్ జాతీయ రహదారి-216ఈ అధికారులతో కలిసి రివిట్మెంట్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముక్కామల-ఈదరపల్లి ప్రధాన పంట కాలువపై ఆధారపడి పెద్ద సంఖ్యలో రైతులు వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కాలువ గట్టు కోతకు గురవుతున్న నేపథ్యంలో రివిట్మెంట్ వాల్ నిర్మాణం చేపట్టడం వల్ల కాలువకు రక్షణ కల్పించడంతో పాటు రైతుల ప్రయోజనాలు పరిరక్షించబడతాయని పేర్కొన్నారు. ప్రధాన కాలువ వెంట రివిట్మెంట్ వాల్ నిర్మించడం ద్వారా జాతీయ రహదారి భద్రత మరింత మెరుగుపడటంతో పాటు వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం ఉండదని తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే డిప్యూటీ ఇంజినీర్లు (డీఈలు), కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### బ్యారేజి 117 గేట్ల ఆధునికీకరణ పనులకు

# శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు

## అన్నదాత సుఖీభవ మొదలైన పథకాలు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు








**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట నియోజకవర్గం ఆత్రేయపురం మండలం బొబ్బరలంక గోదావరి డెల్టా రైతాంగాన్ని ఆదుకుంటున్న రైతు బాంధవులు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రదాతగా, రైతు పక్షపాతిగా, అధికారం అంటేనే బాధ్యతగా పేద ప్రజలకు సేవ చేయడానికి భగవంతుడు ఇచ్చిన అవకాశంగా భావిస్తూ నిరంతరం రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రశంసించారు. ధవలేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీకి 117 నూతన గేట్ల ఏర్పాటు, మరమ్మత్తు పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టడం ఈ ప్రాంత రైతులు చేసుకున్న అదృష్టమని ఎమ్మెల్యే బండారు కొనియాడారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పిచ్చుకలంకలో ఏర్పాటు చేసిన రైతులతో ముఖాముఖి సభలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పొంగూరు నారాయణ, వాసంశెట్టి సుభాష్, కందుల దుర్గేష్, ఎంపీ హరీష్ మాధుర్, జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, తన సహచర ఎమ్మెల్యేలతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు ప్రసంగిస్తూ రైతు ఇరిగేషన్ శాఖామంత్రిగా ఉంటే ఆ శాఖ అద్భుతమైన పనితీరు కనబరుస్తుందని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ను ప్రత్యేకంగా ప్రశంసించారు. నాడు కాటన్ మహాశయుడు సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నిర్మించి ఈ ప్రాంత ప్రజలకు అన్నం పెడితే,ఈ బ్యారేజీని కాపాడటానికి నేనున్నాను అంటూ 117 గేట్ల ఆధునికీకరణ పనులు రూ.150 కోట్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టారని, ఈ ప్రాంత ప్రజల పట్ల రైతుల పట్ల ఆయనకున్న ప్రేమాభిమానాలకు ఇది నిదర్శనమన్నారు. వైసిపి గొడ్డలి పార్టీ ప్రభుత్వంలో బ్యారేజ్ గేట్లకు గ్రీజు కూడా పెట్టలేదని, బేరింగ్లు కూడా బిగించలేదని, చిన్న చిన్న మరమ్మత్తులు కూడా చేపట్టకపోవడంతో బ్యారేజీ అస్తిత్వమే ప్రమాదంలో పడిందన్నారు. ఈ అంశాన్ని గ్రహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బ్యారేజీకి ఎటువంటి ప్రమాదం జరగకూడదు, గోదావరి డెల్టా రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదనే ఆలోచనతో బ్యారేజీ ఆధునీకరణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రైతాంగం పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టిసీమతో కృష్ణ డెల్టాకు ఊపిరి పోసారన్నారు. వెలుగోడు నిర్వాసితులకు పరిహారం అందజేసారన్నారు. పోలవరం ప్రాజెక్టును పరుగులు పెట్టిస్తున్నారని ప్రశంసించారు. నీటిపారుదల రంగానికి, రైతుల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ఐదేళ్ల గొడ్డలి పార్టీ పరిపాలనలో రాష్ట్రంలో చేసిన ఆర్థిక అని విధ్వంసాన్ని, అరాచకాలను సరిదిద్దడానికి తన అపారమైన అనుభవంతో అనునిత్యం ముఖ్యమంత్రి శ్రమిస్తున్నారని, రాష్ట్రాన్ని చక్కదిద్దుకుంటూ ముందుకు వెళ్తున్నారని కొనియాడారు. సెంట్రల్ డెల్టాను కాపాడడానికి లొల్ల లాకుల పునర్నిర్మాణానికి నిధులు కోరితే వెంటనే రూ.74.20 కోట్లు మంజూరు చేశారని గుర్తుచేశారు. అందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అభినవ కాటన్ దొరలా, అపర భగీరథునిలా గోదావరి డెల్టా ఆధునికీకరణ పనులు సైతం చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. కాటన్ ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థను కాపాడే శక్తి ముఖ్యమంత్రి చంద్రబాబుకి మాత్రమే ఉందన్నారు. బిందు సేద్యం, ప్రకృతి సేద్యం, వ్యవసాయ ఆధునికీకరణ అన్నదాత సుఖీభవ మొదలైన పథకాలతో అన్నదాతలకు అండగా నిలుస్తున్నారన్నారు. ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని చేపట్టిన ముఖ్యమంత్రికి, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా వాడపల్లి దేవస్థానం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే బండారు కోరారు. అలాగే పిచ్చుకలంకను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, ఏటిగట్ల బలోపేతానికి నిధులు కేటాయించాలని, నదీపాత నివారణకు, కొత్తపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయ నిర్మాణానికి వ్యవసాయ మార్కెట్ కు సంబంధించిన స్థలం కేటాయింపు, కొత్తపేట ఎమ్మార్వో కార్యాలయం నిర్మాణానికి నిధుల కేటాయింపు, వంతెనల నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు.పేరూరు వై జంక్షన్ నుంచి రావులపాలెం జాతీయరహదారి వరకూ మధ్యలో ప్రతిపాదించిన జాతీయ రహదారిని త్వరితగతిన అభివృద్ధి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి ఈ పనులన్నీ చేపడతానని సానుకూలంగా స్పందించారు.

# ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల పునరుద్ధరణ పనులను ప్రారంభించిన సీఎం చంద్రబాబు





**బొబ్బర్లంక, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట నియోజకవర్గం ఆత్రేయపురం మండలం బొబ్బరలంక తూర్పు గోదావరి, అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లో సీఎం చంద్రబాబు పర్యటన మూడు జిల్లాల పర్యటనలో భాగంగా రాజమండ్రి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికిన మంత్రులు దుర్గేష్, నారాయణ, సుభాష్ స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు.పునరుద్ధరణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి. 2014-19 మధ్య కాలంలో ధవళేశ్వరం బ్యారేజీకి 58 కొత్త గేట్లను అమర్చిన నాటి టీడీపీ ప్రభుత్వం. ఇప్పుడు సీడబ్ల్యూసీ సూచనల మేరకు మిగిలిన 117 గేట్లకు కొత్త గేట్లను అమర్చే పనులకు శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి. వచ్చే ఏడాది జూన్ నెలకు కొత్తగేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశం.గోదావరి పుష్కరాల నాటికి సిద్ధం చేస్తామన్న అధికారులు. ప్రస్తుతం సముద్రంలోకి ఎంత నీరు వెళ్తోందని సీఎం చంద్రబాబు ఆరా.ప్రస్తుతం 27 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోందని వివరించిన అధికారులు. కాల్వలకు ఎన్ని క్యూసెక్కులు విడుదల చేశారని అడిగిన ముఖ్యమంత్రి.14,700 క్యూసెక్కుల నీరు కాల్వలకు వదిలామని చెప్పిన అధికారులు. కాల్వ చివరి భూములకూ నీరు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని సీఎం ఆదేశం.చివరి భూములకు నీరందేలా చూసే విషయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం. గోదావరి, కోనసీమ అందాల సీమ అని పేరుందని దాన్ని నిలబెట్టుకోవాలన్న ముఖ్యమంత్రి.కోనసీమకురాయలసీమ పోటీగా వస్తుందన్న పలువురు ప్రజా ప్రతినిధులు.చక్కటి ఉద్యాన పంటలు రాయలసీమలో పండుతున్నాయన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

## జిల్లా విద్యాశాఖ నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి : బీఎస్పీ డిమాండ్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పదో తరగతి ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లలో జిల్లా పేరును కోనసీమ జిల్లాగా ముద్రించడం జిల్లా విద్యాశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అమలాపురం నియోజకవర్గం ఇంచార్జ్ పోలమూరి మోహన్ బాబు దుయ్య బట్టారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. జిల్లా ఏర్పడి సంవత్సరాలు గడిచినా, ప్రభుత్వం అధికారికంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాగా పేరు మార్చినప్పటికీ, ఇప్పటికీ పాత పేరుతో సర్టిఫికెట్లు ముద్రించడం ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరించినట్లేనని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కోణాల ప్రకాష్, వాకపల్లి హరీష్ కుమార్, సత్య ధర్మరాజు, కురాటి చందర్రావు, గెద్దాడి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అయినాపురంలో కనీస సౌకర్యాలపై సర్వే



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం మండలం అయినాపురం పరిధి పెద్దపేట ఎస్సీ గ్రామంలో ప్రజాసంఘాలు, సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కనీస సౌకర్యాలపై సర్వే చేశారు. ఈ గ్రామానికి శ్మశాన వాటిక లేదని, 2 కిలోమీటర్ల దూరం గోదావరి ఒడ్డుకు తీసుకెళ్లాల్సి వస్తోందని గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

# రావులపాలెంలో దారుణ హత్య



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం మండలం మరియు గ్రామం సోమ సుందర్ రెడ్డి నగర్‌కు చెందిన అనే సాయి తండ్రిపేరు వీరభద్రం వయస్సు 25 సంవత్సరాలు, ఎస్‌సి మాదిగ కులము నకు చెందిన యువకుడిని సోమ సుందర్ రెడ్డి నగర్‌కు ఆనుకుని ఉన్న కర్రీ సత్య నారాయణ రెడ్డికి చెందిన లేఅవుట్‌లో ఆదివారం రాత్రి సుమారు 11 గంటల సమయములో గుర్తు తెలియని దుండగుడు బండరాయితో మోది చంపినట్లు మృతుని తల్లి అనే మసలమ్మ ఇచ్చిన రిపోర్టుపై రావులపాలెం టౌన్ ఇన్స్పెక్టర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయుచున్నారు మృతుని మరణమునకు కారణములు తెలియ రావలసి ఉన్నది.

# ప్రశ్నిస్తే కేసులా?.. ఇదేనా ప్రజాస్వామ్యం



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేసి వేధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వైఎస్సార్సీపీ మండపేట నియోజకవర్గ పరిశీలకులు, పార్టీ కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు విమర్శించారు.గత రెండేళ్లుగా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పత్రికా సమావేశాల్లో లేవనెత్తిన ప్రజా సమస్యలకు కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు సమాధానం చెప్పలేదని ఆయన అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, రాజధాని రైతులకు జరుగుతున్న అన్యాయం, ప్రభుత్వ భూములను తక్కువ ధరలకు ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించడం, రైతులకు పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో వైఫల్యం వంటి అంశాలపై ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధించడం ప్రజాస్వామ్యంలో భావప్రకటన స్వేచ్ఛను హరించడమేనని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నించడం ప్రజల హక్కేనని, రాష్ట్రాన్ని భారీ అప్పుల్లోకి నెట్టినా సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రెండేళ్ల కాలంలో కొత్త ఇళ్ల పట్టాలు, కొత్త పింఛన్లు కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుంచడం కొనసాగిస్తామని, కేసులకు భయపడే ప్రసక్తే లేదని వెంకన్నాయుడు స్పష్టం చేశారు.

# డీఆర్వోకు వైఎస్సార్సీపీ నేతల వినతి



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని కోరుతూ సోమవారం వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో పార్టీ ప్రతినిధులు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పినిపే శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రస్తుతం జరుగుతున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పారదర్శకంగా సాగడం లేదని, కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు చేశారు. రాజకీయ ప్రయోజనాలకు తావులేకుండా, ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా ఈ ప్రక్రియను నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించాలని డీఆర్వోను కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, గన్నవరం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, రాజోలు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పాముల రాజేశ్వరి, అమలాపురం పార్లమెంట్ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, అమలాపురం పరిశీలకుడు కటకంశెట్టి ఆదిత్య, రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు జిన్నూరి బాబీ, రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, వంటెద్దు వెంకన్నాయుడు, దంగేటి రాంబాబు, ఎస్.ఈ.సీ సభ్యుడు కుడుపూడి బాబు, మాజీ ఎంపీ చింతా అనురాధ, టాస్క్ ఫోర్స్ సభ్యులు ఒమ్మి రఘురామ్, తోరం గౌతమ్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి సరేళ్ల రామకృష్ణ, రాష్ట్ర లీగల్ సెల్ సంయుక్త కార్యదర్శి చొల్లంగి సుబ్బురాం, పట్టణ అధ్యక్షుడు సంసాని నాని, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు చీకట్ల కిషోర్, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు తిక్కా ప్రసాద్, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనంగేశ్వర స్వామి ఆలయంలో వేడుకగా రుద్రాభిషేకం




**విశ్వం వాయిస్ న్యూస్ :** వేమనపల్లి బాలా త్రిపుర సుందరి దేవి సమేత అనంగేశ్వర స్వామి ఆలయంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం వేడుకగా జరిగింది. శివుడి జన్మ నక్షత్రమైన ఆరుద్ర, మాస శివరాత్రి సందర్భంగా స్వామివారికి పలు ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం లక్ష బిల్వార్చన పూజలను శాస్త్రోక్తంగా జరిపారు. ఈ విశేష పూజా కార్యక్రమాల్లో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## ప్రశ్న రావణ్‌పై పెట్టిన యుఎపిఎ కేసును ఎత్తివేయాలి : వి.సి.కె పార్టీ డిమాండ్




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** సామాన్య యూట్యూబర్ ప్రశ్న రావణ్ పై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుంది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను ప్రశ్నిస్తున్నాడని పలు కేస్‌లు పెట్టిన కోర్ట్ బెయిల్ మంజూరు చేయడంతో ఆఖరికి తీవ్రవాదులుపై పెట్టె సెక్షన్‌లు యుఎపిఎ కేస్ ను రావణ్ పై పెట్టడాన్ని వి. సి.కె పార్టీ ఖండిస్తున్నది. ప్రజాస్వామ్యంలో ప్రశ్నిస్తున్న సామాన్య పౌరులపై ఇటువంటి కేసులు పెట్టి ప్రభుత్వంను ప్రశ్నిస్తే ఈ విధంగా కేసులు పెట్టి వాళ్ళు నోరు నొక్కాలని చూస్తోందని వి.సి.కె పార్టీ మండిపడింది. ప్రశ్న రావణ్‌ను తక్షణమే విడుదల చేయాలి అని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ వద్ద వి.సి.కె పార్టీ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా చేపట్టి కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వి.సి.కె పార్టీ ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ బొంతు రమణ డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు మెండి డేవిడ్ అంబేద్కర్, జిల్లా సెక్రటరీ కాశీ సాయి కుమార్, జిల్లా యూత్ అధ్యక్షులు పొలమూరి సందీప్, వెన్నపు దొరబాబు,సాపే రమేష్, జల్లి నరేష్, జల్లి అజయ్, నక్క రామ్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.





# పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

## కమిషనర్ సత్యనారాయణ




**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ వివి సత్యనారాయణ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో కమిషనర్ ఎన్.వి.వి సత్యనారాయణ పాల్గొని అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ గ్రీవెన్స్‌లో మొత్తం 11మంది తమ అర్జీలను అందజేశారు. అలాగే డయల్ యువర్ కమిషనర్‌కు ముగ్గురు ఫోన్ చేసి తమ సమస్యను అధికారులు దృష్టికి తీసుకుని ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో నమోదయ్యే ప్రజా సమస్యలను అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వి చరణ్, ఎస్ఈ పి వెంకట్రావు, ఈఈ మాచిరాజు, డీసీపీ కృష్ణారావు, మేనేజర్ శిరీష్ కుమార్, ఉద్యానవన శాఖ ఏడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలువండి

## సంకల్పం స్వచ్ఛంద సేవా సంస్థ 8వ వార్షికోత్సవం కార్యక్రమంలో ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ 24/7 వ్యవస్థాపకుడు పెంకే దుర్గాప్రసాద్‌కు ఘన సత్కారం



"రక్తం అందక ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు తలెత్తకుండా, అర్ధరాత్రైనా.. అపరాత్రైనా ఒక ఫోన్‌కాల్‌తో స్పందించి అత్యవసరంగా రక్తదాతలను సమీకరిస్తూ ఎన్నో కుటుంబాల్లో ఆశలు నింపుతున్న ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ 24/7 గ్రూప్ సేవలకు మరోసారి గుర్తింపు లభించింది."

**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతి ఒక్కరు విధిగా రక్తం చేసి ప్రాణాలు కాపాడాలని ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ 24/7గ్రూప్ వ్యవస్థాపకులు పెంకె దుర్గా ప్రసాద్ అన్నారు. కాకినాడ జిల్లా పోలీస్ కన్వెన్షన్ హాలో సోమవారం సంకల్పం స్వచ్ఛంద సేవా సంస్థ 8వ వార్షికోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న ప్రతి యువకుడు, యువతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసి మరో మనిషి జీవితంలో వెలుగులు నింపాలన్నారు. ఈ గౌరవం తన ఒక్కరిది కాదని.. రక్తం అవసరమని తెలియగానే వెంటనే ముందుకు వచ్చి ప్రాణదాతలుగా నిలుస్తున్న ప్రతి స్వచ్ఛంద రక్తదాతకు, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ 24/7 గ్రూప్ సభ్యులందరికీ చెందుతుందన్నారు. తలసేమియా చిన్నారులు, గర్భిణీలు, డయాలిసిస్ రోగులు, ప్రమాద బాధితులు, అత్యవసర చికిత్స పొందుతున్న వారికి సకాలంలో రక్తం అందించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. ఒక యూనిట్ రక్తం అందించడం అంటే కేవలం ఒక ప్రాణాన్ని కాపాడటం మాత్రమే కాదని, ఒక కుటుంబానికి జీవితాన్ని తిరిగి ఇవ్వడమేనని పేర్కొన్నారు. తనకు లభించిన సత్కారాన్ని నిరంతరం సేవలందిస్తున్న గ్రూప్ సభ్యులకు, రక్తదానం చేస్తున్న ప్రతి రక్తదాతకు, తలసేమియా చిన్నారుల కోసం నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాల్లో పాల్గొంటున్న స్వచ్ఛంద సేవకులందరికీ అంకితం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం పెంకె దుర్గాప్రసాద్ టీంని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంకల్పం స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, సామాజిక సేవకులు, రక్తదాతలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

### బాలా త్రిపురసుందరి సమేత అగస్త్యేశ్వర స్వామివారి

# రథయాత్రలో పాల్గొన్న మంత్రి సుభాష్

## రాష్ట్రాభివృద్ధి, ప్రజల ఆయురారోగ్యాల కోసం అగస్త్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలోని శ్రీ బాలా త్రిపురసుందరి సమేత శ్రీ అగస్త్యేశ్వర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన పవిత్ర రథయాత్రలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఆరుద్ర నక్షత్రం మాస శివరాత్రి సందర్భంగా మంత్రి సుభాష్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని, రాష్ట్రంలో సుభిక్షం, శాంతి నెలకొనాలని అగస్త్యేశ్వర స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, భక్తి భావనలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. రథయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ఘనంగా సేవలందించారు. భక్తుల గోవింద నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ రథయాత్ర వైభవంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ గణేష్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, కూటమి పార్టీ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### కే.గంగవరం మండలం బట్లపాలికలో

# ఉచిత మెడికల్ క్యాంప్

## ముఖ్య అతిథిగా పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్



**కే. గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కే.గంగవరం మండలం బట్లపాలిక గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రీష్వంత్ రాయ్ ముఖ్య అతిథిగా హాజరై క్యాంప్‌ను సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఈ మెడికల్ క్యాంప్‌లో ఎల్.వి.ప్రసాద్ హాస్పిటల్ వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే భీమేశ్వర దంత వైద్యశాల వైద్యులు ఉచిత దంత పరీక్షలు చేపట్టారు. నియోజకవర్గంలో కియా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆసుపత్రి వైద్యులు గుండె సంబంధిత ఉచిత పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా పేకేరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ప్రజలకు జనరల్ హెల్త్ చెకప్‌లు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. నిర్వాహకులు వైద్య బృందాలకు మరియు కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటే సుబ్రహ్మణ్యం, రవ్వ భూషణం, బన్నీ, బాబ్జి కూటమి నాయకులు, మరియు తదితరులు పాల్గొన్నారు.

### రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

# కొత్త విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రారంభం

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను వివిధ డిగ్రీ కోర్సుల్లో చేరడానికి ప్రవేశాలు ప్రారంభమైనట్లు కళాశాల ప్రధానాచార్యులు కే. చిట్టిబాబు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలిచే అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, శారీరక మానసిక వికాసానికి తోడ్పడే ఆటల శిక్షణ, ఆచరణాత్మక అనుభవాన్ని అందించే విహారయాత్రలు ఈ కళాశాల ప్రత్యేకతలు. దీనితో పాటు విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ జీవిత బీమా సౌకర్యం కల్పిస్తున్నారు. అలాగే చదువు పూర్తికాగానే ప్రముఖ అంతర్జాతీయ మరియు దేశీయ ఐటీ కంపెనీలు, బ్యాంకింగ్ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు పొందేలా ప్రాంగణ ఎంపికల (క్యాంపస్ ఇంటర్వ్యూల) సౌకర్యం కూడా ఉంది. జ్ఞానం, క్రమశిక్షణ, విజయం అనే నినాదంతో విద్యార్థులను ఇక్కడ తీర్చిదిద్దుతున్నారు. వాణిజ్య శాస్త్రం (బి.కామ్), కళల విభాగం (బి.ఎ), విజ్ఞాన శాస్త్రం (బి.ఎస్సీ) వంటి వివిధ కోర్సుల్లో చేరడానికి ఆసక్తి గల విద్యార్థులు వెంటనే కళాశాలను సంప్రదించాలని ప్రవేశాల సమన్వయకర్త ఎన్.వి. రమణ కోరారు. మరిన్ని వివరాల కోసం కళాశాల కార్యాలయంలో నేరుగా సంప్రదించవచ్చు.

# భక్త జనంతో పోటెత్తిన శివాలయాలు



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆరుద్ర నక్షత్రం సోమవారం మాస శివరాత్రి పర్వదినం కావడంతో నగరంలోని శివాలయాలు అన్ని భక్తజనంతో పోటెత్తాయి, ఇటువంటి పర్వదినం రోజున ఆ మహా శివునికి అభిషేకం చేస్తే మంచిదని బ్రాహ్మలు చెప్పడంతో శివాలయాలకు పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ గాంధీనగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో ఈవో బాదం శ్రీనివాస చంద్రమూర్తి మాట్లాడుతూ ఈరోజు మాస శివరాత్రి ఆరుద్ర నక్షత్రం కలిసి రావడంతో జనం తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున తరలివచ్చారని వచ్చిన భక్తులకు ఏ విధమైన ఆ సౌకర్యం కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.


# 60 బైక్ కేసుల్లో రూ.38,500 జరిమానాలు



## సీఐ ఎస్‌వివి సత్యనారాయణమూర్తి

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలంలో ఇటీవల బైక్ ప్రమాదాలు ఎక్కువగా జరగడంతో కోరుకొండ ఎస్సై వెంకట రమేష్ ఆధ్వర్యంలో బైక్ తనిఖీలు నిర్వహించారు. సోమవారం కోరుకొండ ఎస్సై వెంకట రమేష్, సీఐ సత్యనారాయణమూర్తి డ్రైవింగ్ లైసెన్స్, సి బుక్, త్రిబుల్ రైడింగ్, ఇన్సూరెన్స్ వంటి రికార్డుల తనిఖీలు నిర్వహించి 60 కేసుల్లో 38,500 రూపాయలు వివిధ జరిమానాల రూపంలో వసూలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన తనిఖీల్లో సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణమూర్తి యువతకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైక్ డ్రైవ్ చేసే వారికి తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ హెల్మెట్ ఉండాలని, లేని పక్షంలో బైక్ యజమానిపై కేసు నమోదవుతుందన్నారు. బైకులకు సంబంధించిన అన్ని రికార్డులు సక్రమంగా ఉన్నాయో? లేదో సరిచూసుకొని ప్రయాణం చేయాలన్నారు. త్రిబుల్ రైడింగ్ చేస్తే భారీ జరిమానాలు తప్పవని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనం ఇచ్చే ముందు తగు జాగ్రత్తలు తెలియజేయా లన్నారు. యువత మత్తుకు బానిసై, తమ బంగారు భవిష్యత్తును చేతులారా పాడు చేసుకుంటున్నారని, ఏదైనా ప్రమాదం వాటిల్లితే కుటుంబసభ్యుల పరిస్థితి ఏంటి అని అవగతం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకట రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ముగ్గురు కొత్త అధ్యాపకులు



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పదోన్నతుల ద్వారా ముగ్గురు అధ్యాపకులు కొత్తగా విధుల్లో చేరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.కె.వి. శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం తెలుగు విభాగంలో యు దుర్గారావు, ఆంగ్ల విభాగంలో ఐ.సమర్పణ్ కుమార్, కామర్స్ విభాగంలో పోడూరి తిరుమల గౌరీనాథ్ బాధ్యతలు స్వీకరించారు.ఈ ముగ్గురి రాకతో కళాశాల విద్యాపరంగా మరింత బలోపేతం అవుతుందని ఆయన అన్నారు. మండపేట పరిసర ప్రాంతాల నుండి ఎక్కువ మంది విద్యార్థులు ఈ కళాశాలలో చేరతారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్ పాల్గొన్నారు.

# రంగు మారిన నూనె వాడితే చర్యలు : రాజీవ్

**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పల్లిపాలెం, రాజుపాలెం గ్రామాల్లోని హోటళ్లలో సోమవారం మున్సిపల్ సిబ్బంది విస్తృత తనిఖీలు చేశారు. కిచెన్లోని వంట నూనె, పరిసరాల పరిశుభ్రతను అధికారులు పరిశీలించారు. నిల్వ ఉంచిన మాంసం, రంగు మారిన నూనె వాడితే కఠినచర్యలుతీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఇన్చార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ రాజీవ్, సిబ్బంది పాల్గొన్నారు.

# సురేశ్వర స్వామి ఆలయంలో దీపోత్సవం



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరంలోని శైవ క్షేత్రాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. జ్యేష్ఠ మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం కలయికతో కూడిన మహా పర్వదినం పురస్కరించుకొని శ్రీ ఉమా సురేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ రోజు శివారాధన చేయడం వల్ల అద్భుతమైన శుభ ఫలితాలు కలుగుతాయని పండితులు పేర్కొన్నారు. మహిళలు ఆలయ ప్రాంగణాల్లో పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు.

# సీఎంను కలిసిన అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు

## సాగునీటి లాకుల పునరుద్ధరణపై వినతి



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి డెల్టా అభివృద్ధికి కొత్త దిశ: ఆర్థర్ కాటన్ బ్యారేజీ గేట్ల ఆధునికీకరణ పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం – సీఎంను మర్యాద పూర్వకంగా కలిసిన అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గోదావరి డెల్టా రైతాంగ సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. కొత్తపేట నియోజకవర్గంలోని పిచ్చుకులంక గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీకి 117 కొత్త గేట్ల ఏర్పాటు, ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. ఈ పర్యటన సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా వేమగిరి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గోదావరి డెల్టా అభివృద్ధికి కొత్త దిశ లభించిందన్నారు. గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ పునరుద్ధరణ కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించి రూ.150 కోట్లు కేటాయించడం రైతుల సంక్షేమంపై ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. బ్యారేజీకి 117 కొత్త గేట్ల ఏర్పాటు పనులను ప్రారంభించడం డెల్టా చరిత్రలో ఒక కీలక ఘట్టమని అభివర్ణించారు. అదే సందర్భంగా అమలాపురం నియోజకవర్గ పరిధిలోని రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పలు సాగునీటి లాకుల పునరుద్ధరణ అవసరాన్ని ఎమ్మెల్యే ఆనందరావు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ, అమలాపురం నియోజకవర్గంలోని సాగునీటి లాకుల పునరుద్ధరణకు అవసరమైన చర్యలను తక్షణమే చేపడతామని హామీ ఇచ్చారు. పిచ్చుకులంకలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



### ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ గేట్ల

# పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన

**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలసి పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** గోదావరి డెల్టా లక్షలాది ఎకరాలకు పచ్చని జీవనాడి అయిన చారిత్రాత్మక సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ రక్షణ, ఆధునీకరణ దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసిందనీ రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకి సంబంధించి అత్యంత కీలకమైన గేట్ల పునరుద్ధరణ (పాత గేట్ల స్థానంలో నూతన గేట్ల ఏర్పాటు, ఆధునీకరణ) పనుల శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ పనులకు అధికారికంగా శంకు స్థాపన చేశారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ముఖ్యమంత్రితో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ గోదావరి డెల్టా పరిధిలోని తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టాల పరిధిలో సాగు, తాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకం కలగకుండా, బ్యారేజీ పటిష్టతను పెంచేందుకు ఈ పునరుద్ధరణ పనులను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో చేపట్టిందని పేర్కొన్నారు. కాలగమనంలో అరిగిపోయిన, దెబ్బతిన్న పాత గేట్ల స్థానంలో అత్యాధునిక సాంకేతికతతో కూడిన నూతన గేట్లను అమర్చనున్నారని ఎమ్మెల్యే వేగుళ్ల అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా బ్యారేజీ నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాగానే యుద్ధప్రాతిపదికన నిధులు మంజూరు చేసి కాటన్ బ్యారేజీ రక్షణకు శ్రీకారం చుట్టడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ ఆధునీకరణ పనుల ద్వారా ఉమ్మడి గోదావరి జిల్లాల రైతాంగానికి సాగునీటి కష్టాలు శాశ్వతంగా తప్పుతాయని, సకాలంలో పనులు పూర్తి చేసేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారని ఆయన తెలిపారు.

# జ్ఞాన లింగేశ్వర స్వామికి సహస్ర ఘటాభిషేకం

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** వర్షాభావ పరి స్థితులు వల్ల సకాలంలో వర్షాలు వర్షించాలని లోక శ్రేయస్సు కోసం, నగరంలో సహస్ర ఘటాభిషేకం జరిగింది. జ్ఞాన సరస్వతి పీఠంలోని జ్ఞాన లింగేశ్వర స్వామికి ఈ సందర్భంగా 1008 బిందెలతో భక్తులు జలాభిషేకం చేసారు.. తూర్పుగోదావరి జిల్లా బ్రాహ్మణ మిత్ర సేవా సంఘం, జిల్లా పురోహిత సమాఖ్య, నగర బ్రాహ్మణ మిత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో జ్ఞాన సరస్వతి పీఠం నిర్వాహకులు శ్రీ తోట సుబ్బారావు నిర్వా హణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాదిరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు వల్ల పంటలు వేయలేని పరిస్థితి ఏర్పడిందని, భగవంతుని కృపతో సకాల వర్షాలు కురవాలని ఈ సహస్ర ఘటాభిషేకాన్ని నిర్వహిం చినట్లు తెలిపారు. శాస్త్రంలో చెప్పినట్టుగా వరుణ దేవుని ఆహ్వానించి అన్నాభిషేకంతో బాటు జలాభిషేకం నిర్వహించామని తెలిపారు. జ్ఞాన సరస్వతి పీఠం నిర్వాహకులు తోట సుబ్బారావు మాట్లాడుతూ ఆ పరమశివునికి అన్ని వర్ణాలవారు ఈ జలాభిషేకాన్ని నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కురగంటి సతీష్, వైసీపీ నాయకురాలు పిల్లి నిర్మల వాడ్రేవు జమిందార్, వాడ్రేవు మల్లప రాజు, నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు దూర్వాసుల సత్యనారాయణ, నగర ప్రధాన కార్యదర్శి నిడమర్తి



వెంకటేష్, నగర ఉపాధ్యక్షులు దినవహి నాగసాయి, హరే శ్రీనివాస మహిళా మండలి వ్యవస్థాపకులు మంచిరాజు హేమలత దంపతులు, జిల్లా బ్రాహ్మణ మహిళా ముఖ్య సలహాదారులు ఏచూరి లక్ష్మీప్రసన్న, సరస్వతి ఘాట్ భక్త మహిళా సంఘం పెదమల్లు వాగ్దేవి, ఆంధ్ర కేసరి యువజన సమితి నాయకులు రఘుపాత్రుని సాయిబాబా, క్రొవ్విడి సుబ్రహ్మణ్యం, నగర బ్రాహ్మణ కార్యదర్శి మధిర శర్మ తదితరులు పాల్గొన్నారు.

# రజకులకు ఎస్సీ హోదా బాధ్యత కూటమి ప్రభుత్వానిదే..

**రాజమండ్రి రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర నాయకుల విజ్ఞప్తి**

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రజకులు ఆర్ధికంగా, రాజకీయంగా, సామాజికంగా ముందుకు సాగేందుకు ఎస్సీలో చేర్చడం ఒక్కడే మార్గమని రాజమండ్రిలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు రజక సంఘం రాష్ట్ర నాయకులు అభిప్రాయ పడ్డారు. స్థానిక గోదావరి గట్టున ఉన్న త్యాగరాజ నారాయణ దాస సేవా సమితిలో రాజమండ్రి పట్టణ రజక సేవా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి హాజరైన రజక సంఘం నాయకులతో రజకుల ఐక్యతా రౌండ్ టేబుల్ సమావేశం -5 ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో రజక చైతన్య సేవా సంఘం అధ్యక్షుడు కాకినాడ రామారావు, ఎస్సీ సాధనా సమితి కన్వీనర్ అక్కనపల్లి లక్ష్మయ్య, రాష్ట్ర నాయకులు బాలయ్య తదితరులు మాట్లాడారు. రజకులను ఎస్సీల్లో చేర్చుతామని చంద్రబాబు ఎన్నికల సభలోనూ, నారా లోకేష్ యువగళం పాదయాత్రలోనూ హామీ ఇవ్వడం జరిగిందన్నారు. రజకులకు ఎస్సీ హోదాతో మాత్రమే సమాజంలో రక్షణ లభిస్తుందని, విద్య, ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయన్నారు. 19 రాష్ట్రాల్లో, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో రజకులు ఎస్సీలుగా ఉన్నారని, ఇక్కడ



మాత్రం రజకులను బీసీలుగా పరిగణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. రజకులను ఎస్సీ చేర్చే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించే బాధ్యత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడే తీసుకోవాలని, ఆయన తలుచుకుంటే వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి ఎస్సీ హోదా సాధింగలరని పేర్కొన్నారు. వెంటనే దీనిపై అధ్యయనానికి సమయపాలనలో కూడిన కమీషన్ వేసి రజకులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసారు. రజకులకు ఎస్సీ హోదా సాధించడానికి మాత్రమే రాష్ట్రవ్యాప్తంగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నామని, ఇది కూటమి ప్రభుత్వానికి, టీడీపీకి వ్యతిరేకంగా నిర్వహిస్తున్నట్టు కొందరు చేస్తున్న విమర్శలను తప్పుపట్టారు. ఈ సమావేశాల్లో చాలా మంది టీడీపీ నాయకులు కూడా పాల్గొంటున్నారని, రజకులకు ఎస్సీ హోదా సాధించాలన్న ఏకైక లక్ష్యంతో అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రజకులను ఎస్సీల్లో చేర్చుతారనే నమ్మకంలో గడచిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి పెద్దఎత్తున తామంతా ఓట్లేసి గెలిపించామన్న విషయాన్ని గ్రహించి తమకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో రాజమండ్రి పట్టణ రజక సేవా సంఘం అధ్యక్షుడు బొమ్మదేవర శ్రీనివాసరావు, శాశ్వత గౌరవ అధ్యక్షులు పాలమూరి వెంకట్రావు, నందమూరి శ్రీనివాస్, కడిమి అప్పారావు, బొండపల్లి గణేష్, తాటిపాక వెంకటేశ్వరరావు, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

# వైయస్సార్సీపి పంచాయతీ విభాగం అధ్యక్షులుగా సింగంపల్లి

**సింగంపల్లికి పలువురు అభినందనలు**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీ విభాగం అధ్యక్షులుగా సింగంపల్లి శ్రీనివాసును నియమించినట్లు వైయస్సార్సీపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో కోరుకొండ మండలంలో వైఎస్ఆర్సిపి అనుబంధ కమిటీలను పూర్తిస్థాయిలో నియమించామని, ఆయా కమిటీలసభ్యులు అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల తరఫున ప్రజా సమస్యలపై పోరాటానికి సంసిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కోరుకొండ మండల పంచాయతీ విభాగం అధ్యక్షులుగా రాఘవపురం గ్రామానికి చెందిన సింగంపల్లి శ్రీనివాసును నియమించామన్నారు. ఈ సందర్భంగా సింగంపల్లి శ్రీనివాస్ కు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, రాఘవ పురం గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సింగంపల్లి మాట్లాడుతూ తనపై ఎంతో విశ్వాసంతో మండల పంచాయతీ విభాగం అధ్యక్షులుగా నియమించిన జక్కంపూడి కుటుంబానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరితో మమేకమై, మండలస్థాయిలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించి, రానున్న ఎన్నికలలో పార్టీ విజయమే ధ్యేయంగా పనిచేద్దామన్నారు.

# 14 నుండి డిఎల్ఇడి ప్రవేశానికి వెబ్ అప్షన్స్

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ డిప్లొమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏ పి డీసెట్ -2026) పరీక్షలో అర్హత సాంధించిన అభ్యర్థులకు ప్రభుత్వ మరియు ప్రైవేట్ డి ఎల్ .ఎడ్. కళాశాలలో ప్రవేశాల నిమిత్తం 14.07.2026 నుండి 18.07.2026 వరకు వెబ్ ఆధారిత ఆప్షన్ లు నమోదు చేసుకొనుటకు అవకాశం కల్పించబడిందని బొమ్మూరు డైట్ ప్రిన్సిపాల్ ఆర్జెడి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు నమోదు చేసిన వెబ్ ఆప్షన్ల ఆధారంగా 20.07.26 నుండి 23.07-26 వరకు సీట్ల కేటాయింపు చేయబడునన్నారు. సీట్లు కేటాయించబడిన అభ్యర్థులు తమ తాత్కాలిక ప్రవేశపత్రాలను అధికారిక వెబ్ సైట్ నుండి డౌన్లోడ్ చేసుకొనవచ్చునన్నారు. సీట్లు కేటాయించబడిన అభ్యర్థులు 24.07.2026 నుండి 29.07.2026 వరకు సంబంధిత ప్రభుత్వ డైట్ కళాశాలలలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను సమర్పించి, ధ్రువ పత్రాలపరిశీలన అనంతరం తుది ప్రవేశ పత్రం పొందవలెనన్నారు. డి.ఎల్.ఇడి మొదటి సంవత్సరం తరగతులు 30.07.2026 నుండి ప్రారంభమకానున్నవి. కావున, అర్హత సాధించిన అభ్యర్థులు అందరూ నిర్ణీత షెడ్యూల్ ప్రకారం వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకొని, సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరై, తమకు కేటాయించిన కళాశాలలలో ఇవ్వబడిన గడువులోగా ప్రవేశం పొందవలసినదిగా ప్రిన్సిపాల్ రాజు తెలియచేసారు.

### ఎస్ఎస్ఎ ఆఫీస్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు

# దరఖాస్తుల ఆహ్వానం

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** జిల్లా ప్రాజెక్ట్ కార్యాలయం, సమగ్ర శిక్ష, తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరం నందు డేటా ఎంట్రీ ఆపరేటర్ -1 పోస్టు ఖాళీగాయున్నదని,కావున సదరు పోస్టు నందు తాత్కాలికముగా పూరించుటకు అర్హత గల అభ్యర్థులు నుండి ధరఖాస్తులు కొరడమైనదని ఎస్ఎస్ఎపిసిఎస్ సుభాషిణి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతలు: గుర్తింపు పొందిన యునివర్సిటీ నుండి డిగ్రీ, కంప్యూటర్ పరిజ్ఞానం, తెలుగు & ఇంగ్లీష్ టైపింగ్ (ఎమ్ఎస్ ఆఫీస్ / పిజి డిసిఎ / డిసిఎ / ఇంజనీరింగ్ / ఏదైనా కంప్యూటర్స్ సబ్జెక్టుతో గ్రాడ్యుయేషన్) అర్హత గల అభ్యర్థులు ధరఖాస్తులను ది.18.07.2026 (అనగా శనివారం) సాయంత్రం 05.00 గంటలలోపు జిల్లా ప్రాజెక్ట్ కార్యాలయం, సమగ్ర శిక్ష, తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరంనకు చేరునట్లుగా పంపవలసినదిగా ఆ ప్రకటనలో కోరారు. ఇంకనూ అదనపు వివరములకు.. మొబైల్ నెంబర్ :8297816483లో సంప్రదించవలెనన్నారు.

# కోరుకొండ ఏపీఎంగా బాధ్యతలు చేపట్టిన నాగార్జున



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండల ఏపీఎంగా నాగార్జున ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. నాగార్జున గతంలో రాజానగరం మండలంలో సిసిగా పనిచేస్తూ, పదోన్నతి అనంతరం కోరుకొండ ఏపీఎంగా విచ్చేశారు. సోమవారం కోరుకొండ మండల అభివృద్ధి అధికారి బత్తిన అశోక్ కుమార్ ను మర్యాదపూర్వంగా కలిశారు. అనంతరం ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్, నాగార్జునకు అభినందనలు తెలియజేశారు. అనంతరం అశోక్ కుమార్ అందరూ కలిసికట్టుగా బాధ్యతాయుతంగా పనిచేసి, మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజల అన్నలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు ఎంవి ఆర్ ఎస్ కృష్ణ, బి రామచక్రం, వై నాగమణి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

### గాదరాడ మృతుల కుటుంబాలను

# అన్ని విధాల ఆదుకుంటాం : బత్తుల

**మృతులకు ప్రగాఢ సంతాపం**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని గాదరాడ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఆదివారం రాత్రి బైక్‌పై గాదరాడ నుండి కోరుకొండ వెళుతూ నరసాపురం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద చెట్టును ఢీకొని మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే. సోమవారం రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మృతుల కుటుంబాలను పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలియజేశారు. అనంతరం మృతదేహాలకు త్వరితగతిన పోస్టుమార్టం నిర్వహించే విధంగా వైద్యాధికారులుతో మాట్లాడారు. తమ స్వగ్రామానికి చెందిన ముగ్గురు యువకులను కోల్పోవడం చాలా బాధాకరమని, ప్రభుత్వపరంగా మృతులకు అన్ని విధాల న్యాయం జరిగేలా సత్వర చర్యలు తీసుకుంటానని మృతుల కుటుంబాలకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన పెందుర్తి అభిరామ్



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడుని మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పెందుర్తి అభిరామ్ తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధవలేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీకి 150కోట్లతో నూతన గేట్ల పునః నిర్మాణ కార్యక్రమానికి విచ్చేసిన నారా చంద్రబాబు నాయుడుని, రాజానగరం నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ యువ నాయకులు పెందుర్తి అభిరామ్ మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు.






ఐరెన్ లెగ్ అని అవమానించారు..
9 సినిమాలనుంచి తీసేశారు..

# కట్ చేస్తే ఇప్పుడు టాప్ హీరోయిన్

ప్రస్తుతం స్టార్ హోదాలో ఉన్న తారలు చాలా కాలంగా ఒక్క సరైన అవకాశం కోసం ఎదురుచూసినవాళ్లే.. కొంతమంది స్టార్ డమ్ వచ్చిన తర్వాత కూడా సినిమాలకోసం ఎదురుచూస్తున్నారు. కొందరు వచ్చిన ప్రతి ఆఫర్ ఉపయోగించుకుని సహజ నటనతో ప్రేక్షకులను హృదయాలను గెలుచుకున్నారు. వారిలో ఈ వయ్యారి భామ ఒకరు. అందం, అభినయంతో ఇండస్ట్రీలో తనదైన ముద్రవేసింది. ప్రస్తుతం సినీరంగంలో స్టార్ దూసుకుపోతున్న ఈ అందాల భామ కూడా కెరీర్ తొలినాళ్లల్లో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని.. తెలిపింది. అంతే కాదు తనను ఐరెన్ లెగ్ అనే ముద్ర వేశారని.. దీంతో రాత్రికి రాత్రే తనను తొమ్మిది సినిమాల నుంచి తీసేశారని తెలిపింది. కట్ చేస్తే ఆమె ఇప్పుడు ఆమె పాన్ ఇండియా హీరోయిన్.. ఆమె మరెవరో కాదు దర్టీ పిచ్చర్ సినిమాతో ఒక్కసారిగా కుర్రాళ్ల గుండెల్లో గునపాలు దింపిన బాలీవుడ్ బ్యూటీ విద్య బాలన్. గతంలో ఓ యూట్యూబ్ ఛానల్?కు ఇచ్చిన ఇంటర్వ్యూలో విద్యా బాలన్ మాట్లాడుతూ.. "కెరీర్ మొదట్లో హీరో మోహన్ లాల్ జోడిగా చక్రం సినిమాలో నటించే ఛాన్స్ వచ్చిందని తెలిపింది.. అయితే షూటింగ్ స్టార్ట్ అయిన కొన్ని రోజులకే ఆ సినిమా అనుకొనికరణల వల్ల ఆగిపోయింది. అందుకు నేను కారణం అంటూ ప్రచారం జరిగింది. దీంతో కొందరు నాపై ఐరెన్ లెగ్ అనే ముద్ర వేసి నాపై విమర్శలు చేశారు. ఆ ఒక్క సినిమా ఆగిపోయిందని తెలిసి..ఐరెన్ లెగ్ అని ముద్ర వేయడంతో రాత్రికి రాత్రే నన్ను 9 ప్రాజెక్ట్స్ నుంచి తొలగించారు. అయితే.. అసలు మ్యాటర్ ఏంటంటే.. ఆ సినిమా ఆగిపోవడానికి నేను కారణం కాదు. ఆ సినిమా డైరెక్టర్, మోహన్ లాల్ మధ్య అభిప్రాయ బేధాలు రావడంతో ఆ ప్రాజెక్ట్ ఆపేశారు. కానీ ఆ సినిమా నా కెరీర్ పై ఎంతో ప్రభావం చూపించిందని చెప్పుకొచ్చింది విద్యా బాలన్.. ఈ కామెంట్స్ ఇప్పుడు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం విద్యా బాలన్ ఆచితూచి సినిమాలు చేస్తుంది.

మా మధ్య ఎలాంటి గొడవలు జరగలేదు..

# మేమంతా కలిసే ఉంటాం.. : జానీ మాస్టర్



సర్వసభ్య సమావేశంలో వచ్చిన మెజార్టీ అభిప్రాయంతోనే ముందుకు వెళ్తున్నాం. ఏక పక్ష నిర్ణయం ఎక్కడా తీసుకోలేదని అన్నారు టీఎఫ్‌టీడీడీఏ అధ్యక్షురాలు సుమలత. డ్యాన్సర్ హెల్త్ ఇన్సూరెన్స్‌కి 18 లక్షలు విరాళంగా ఇచ్చారు జానీ మాస్టర్. TFDD-DA 35 ఏళ్ల చరిత్ర ఉంది.. ఎన్నో ఏళ్లుగా చిన్న చిన్న తప్పులు, పెద్ద పెద్ద తప్పులు కూడా జరుగుతున్నాయి.. ఎవరు తప్పు చేసినా ప్రెసిడెంట్ మీదికే వస్తుంది.. ప్రెసిడెంట్‌గా మీరేం చేసారు.. మీరెందుకు క్వశ్చన్ చేయలేదు అని అడుగుతున్నారు అని అన్నారు సుమలత. తెలుగు సినిమా టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం రసాభాసాగా మారింది. జానీ మాస్టర్, శేఖర్ మాస్టర్‌కి సంబంధించిన విజువల్స్ అన్నీ కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇద్దరి మధ్య గొడవ జరిగిందంటూ వార్తలు వ్యాపించాయి. ఇక ఈ మేరకు జానీ మాస్టర్, టీఎఫ్‌టీడీడీఏ అధ్యక్షురాలు సుమలత వివరణ ఇచ్చేందుకు సోమవారం నాడు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ మేరకు నిర్వహించిన ప్రెస్ మీట్‌లో జానీ మాస్టర్ మాట్లాడుతూ .. "సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికలు నిర్వహించాలా? వద్దా? అని చర్చించుకునేందుకు మేం అందరం వచ్చాం. మా బాడీలో కొన్ని విషయాల మీద చర్చించుకున్నాం. కొన్ని వీడియోలు పట్టుకుని నాకు, శేఖర్ మాస్టర్‌కి గొడవ జరిగిందంటూ ప్రచారాలు చేశారు. అవన్నీ ఫేక్. శేఖర్ మాస్టర్, బాను మాస్టర్ ఇలా అందరూ మంచి వ్యక్తులు. ఇక్కడ ఎవరికి ఎవరూ శత్రువులం కాదు. అందరికి అందరం సపోర్ట్‌గా ఉంటాం. ఈ వీడియోలు చూసి చిరంజీవి గారు కూడా షూటింగ్‌లో మాతో మాట్లాడారు. శేఖర్ మాస్టర్ గారు, నేను, చిరంజీవి గారు కలిసి ఆనందంగా మాట్లాడుకున్నాం. కలిసి భోజనం చేశాం. మాలో ఎలాంటి గొడవలు లేవు. మాకు చిరంజీవి గారు, హీరోలందరూ సపోర్ట్ చేస్తుంటారు. టాలెంట్ ఉన్నవారిని మా హీరోలు ఎంకరేజ్ చేస్తారు. ఈ సందర్భంగా చిరంజీవికి థాంక్స్ చెబుతున్నాం. మేమంతా ఈ స్థాయిలో ఉన్నామంటే ఆయన డ్యాన్స్, ఆయన సినిమాలు, ఫైట్స్ చూసే ఇక్కడకు వచ్చాం. మనకు డ్యాన్స్ అంటే చిరంజీవి గారే. శేఖర్ మాస్టర్ గారు, నాకు, ఇతర మాస్టర్‌లకు మధ్య ఎలాంటి విబేధాలు లేవు.. ఒక ఇంట్లో తమ్ముడు గట్టిగా మాట్లాడతాడు.. అన్న మెల్లిగా మాట్లాడతాడు.. అంతే. ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా అందరం కలిసే ఉంటాం. జానీ మాస్టర్ హెల్త్ ఇన్సూరెన్స్ గురించి మాట్లాడారు.. ఏం చేయడం లేదు అని మాటలు అన్నారు. నేను ఈ మధ్య ఎక్కువగా 'పెద్ది' సినిమాకే పని చేశాం. మిగతా ఏ పాటలు కూడా చేయలేదు. మన డ్యాన్సర్స్‌ల కష్టాలు, హెల్త్ ఇన్సూరెన్స్ గురించి రామ్ చరణ్ సార్ గారు మాకు నలభై లక్షలు ఇచ్చారు. అందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ చేయాలంటే 58 లక్షల ఖర్చు అవుతుంది. మిగతా 18 లక్షల గురించి చాలా మంది మాస్టర్‌లను అడిగాను. కానీ ఎవ్వరూ ముందుకు రాలేదు. అలా అని నేను వారిని తప్పు పట్టను. మొన్నే నాకు 'పెద్ది' టీం నుంచి పేమెంట్ వచ్చింది. నాకు వచ్చిన 18 లక్షల చెక్ పేమెంట్‌లోంచి ఒక్క రూపాయి తీసుకోకుండా అంతా కూడా డ్యాన్సర్ హెల్త్ ఇన్సూరెన్స్‌కి ఇస్తున్నా"అని అన్నారు. టీఎఫ్‌టీడీడీఏ అధ్యక్షురాలు సుమలత మాట్లాడుతూ "టీఎఫ్‌టీడీడీఏ లాంటి పెద్ద సంస్థను నడిపించడం అంటే చిన్న విషయం కాదు. ఏ చిన్న తప్పు జరిగినా అధ్యక్షురాలిగా నా మీదకే వస్తుంది. గత బాడీలో చాలా వరకు నిధులు దుర్వినియోగం అయ్యాయి. వాటిని ప్రశ్నించినందుకు మాకు సమస్యలు సృష్టిస్తూనే ఉన్నారు. జోసెఫ్ మాస్టర్ ఓడినప్పటి నుంచి మా మీద వ్యతిరేకత మొదలైంది. ఏ పని చేసినా ప్రతీ దాంట్లో తప్పులు వెతకాలని చూస్తున్నారు. మేం ఏకపక్షంగా ఏ నిర్ణయం తీసుకోలేదు. ఫెడరేషన్‌కి వ్యతిరేకంగా ఎన్నికలు జరపడం లేదు. అన్నీ కూడా లీగల్‌గానే చేస్తున్నాం. మీడియా మాత్రం థంబ్ నెయిల్స్ కాస్త చూసి పెట్టాలని కోరుతున్నాను. కొంత మంది ఇన్ ఛార్జీలు నిర్మాతల వద్ద ఎక్కువగా తీసుకుని, డ్యాన్సర్‌లకు మాత్రం తక్కువ ఇస్తున్నారు. ఇది నిజం. ఇది బయట పెట్టినప్పటి నుంచి మా మీద వ్యతిరేకత వచ్చింది. ఈ విషయం ఫెడరేషన్‌కి తెలిసినా మౌనం వహిస్తోంది. అలా మేం మా మాజీ జనరల్ సెక్రటరీని ప్రశ్నించినప్పటీ నుంచీ మాకు సమస్యలు సృష్టిస్తూనే ఉన్నారు. మేం అన్ని ఆధారాలతో సహా బయట పెట్టి సస్పెండ్ చేసిన తరువాత వారు రాజీనామా చేశారు. ఈసీ మెంబర్లు 8 మంది రాజీనామా చేసి ఆ తర్వాత చేయనట్టుగా మాట్లాడారు. జనరల్ సెక్రటరీ, క్యాషియర్, 8 మంది ఈసీ మెంబర్లే నిన్న గొడవ పడ్డారు. వీరి తప్పులకు టోటల్ బాడీని ఎందుకు రద్దు చేయాలి అనేది నా ప్రశ్న. డ్యాన్సర్ డబ్బులు తింటే ఎలా అని మేం అడిగాం. వారంతా రాజీనామా చేశారు.. కచ్చితంగా ఎన్నికలు జరగాల్సిందే అని మిగతా మెంబర్స్ అన్నారు. జనరల్ బాడీ మీటింగ్‌కి వచ్చిన 188 మెంబర్లలో 136కి పైగా మెంబర్స్ ఆమోదించారు. బై ఎలక్షన్స్‌కి వెళ్లాలని నిర్ణయించారు. ఈ జనరల్ బాడీ మీటింగ్‌ని కూడా ఫెడరేషన్ ఒప్పుకోవడం లేదు. మొత్తం బాడీని రద్దు చేసి ఎన్నికలు పెట్టాలని వాళ్లు అంటున్నారు. వాళ్లు చేసిన తప్పుకి మేం ఎందుకు రద్దు చేయాలి. అలా రద్దు చేయాలనే నియమం ఎక్కడా లేదు. మేమే వారిని తీసేశాం అని, బాయ్ కాట్ చేశామని గొడవ చేశారు. రాజీనామా చేసిన వారి స్థానాలకు ఉప ఎన్నికలు జరగాలా.? లేదా? అన్న ఈ విషయం కోసమే మా సీక్రెట్ ఓటింగ్ జరిగింది. ఎన్నికలు జరగాలా? వద్దా? అన్న దానిపై ఓటింగ్ జరిగితే.. ఎన్నికలు జరిగాయ్ అని బయటకు ప్రచారం చేశారు. మాకు ఫెడరేషన్ సహకారం కావాలి. వారి సహకారంతోనే మేం ముందుకు వెళ్తాం. ఫెడరేషన్ రూల్స్ పాటిస్తూ లీగల్‌గానే ముందుకు సాగుతాం. ఉప ఎన్నికలు కావాలనే మెజార్టీ ఓటింగ్ వచ్చింది. ఫెడరేషన్‌కి వ్యతిరేకంగా వెళ్లాలనే ఉద్దేశం మాకు లేదు. సర్వసభ్య సమావేశంలో వచ్చిన మెజార్టీ అభిప్రాయంతోనే ముందుకు వెళ్తున్నాం. ఏక పక్ష నిర్ణయం ఎక్కడా తీసుకోలేదు' అని అన్నారు.

# చైనా గడ్డపై తెలంగాణ బిడ్డ సంచలనం..

## ఆసియా అండర్-23 అథ్లెటిక్స్‌లో గోల్డ్ మెడల్




చైనాలో జరిగిన ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన ప్రవల్లిక నరిమళ్ల భారత మహిళల 4ఐ400 మీటర్ల రిలే జట్టుతో కలిసి స్వర్ణ పతకం గెలిచింది. ఈ ఘనతపై సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు.

చైనాలోని ఒర్డోస్ వేదికగా జరిగిన మొట్టమొదటి ఆసియా అండర్-23 అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ 2026లో భారతదేశానికి అద్భుతమైన విజయం లభించింది. మహిళల 4ఐ400 మీటర్ల రిలే పరుగుపందెంలో భారత మహిళల జట్టు అసాధారణ ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ విజేత జట్టులో నిలిచి దేశ ఖ్యాతిని అంతర్జాతీయ వేదికపై చాటిన తెలంగాణ క్రీడాకారిణి ప్రవల్లిక నరిమళ్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ప్రవల్లిక సాధించిన ఈ విజయం తెలంగాణ రాష్ట్రానికే కాకుండా, యావత్ దేశానికే గర్వకారణమని సీఎం కొనియాడారు.

**అంతర్జాతీయ వేదికపై మెరిసిన తాపీ మేస్త్రీ కూతురు**

ప్రవల్లిక నరిమళ్ల ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చి ఈ అరుదైన మైలురాయిని అందుకుంది. ఒక తాపీ మేస్త్రీ కుమార్తె అయిన ప్రవల్లిక, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ క్రీడలపై ఉన్న ఇష్టంతో కష్టపడి పైకి వచ్చింది. పట్టుదల, క్రమశిక్షణ ఉంటే జీవితంలో సాధించలేనిది ఏదీ లేదని ఆమె తన విజయంతో నిరూపించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసించారు. ప్రస్తుతం ఆమె నల్గొండలోని ఎస్సీ గురుకుల డిగ్రీ కాలేజీలో విద్యనభ్యసిస్తోంది. డిండి గురుకుల స్పోర్ట్స్ అకాడమీలో చేరి అక్కడ లభించిన అత్యుత్తమ శిక్షణను సద్వినియోగం చేసుకుని ఇవాళ అంతర్జాతీయ స్థాయిలో పతకాన్ని ముద్దాడింది. దేశంలోని యువ క్రీడాకారులందరికీ ప్రవల్లిక ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని సీఎం పేర్కొన్నారు.

**చైనాను సొంతగడ్డపైనే ఓడించిన భారత నలుగురు వీరనారీలు**

ఆసియా అండర్-23 అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో భారత 4ఐ400 మీటర్ల రిలే జట్టులో ప్రవల్లికతో పాటు శ్రావణి సచిన్ సాంగ్లే, సాంద్రమోల్ సాబు, నోఫిసా ఖతూన్ ప్రాతినిధ్యం వహించారు. ఈ నలుగురు సభ్యుల భారత బృందం మైదానంలో మెరుపు వేగంతో పరుగెత్తింది. కేవలం 3:33.62 సెకన్ల రికార్డు సమయంలోనే పరుగును పూర్తి చేసి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ రేసులో ఆతిథ్య దేశమైన చైనా జట్టుకు గట్టి పోటీ ఇస్తూ, వారిని వెనక్కి నెట్టి మరీ భారత్ నంబర్ వన్ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. ఈ అద్భుతమైన రేసు క్రీడాభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది.

**రాష్ట్ర స్థాయిలో 23 స్వర్ణాలు.. తిరుగులేని ప్రవల్లిక రికార్డు**

అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడానికి ముందే ప్రవల్లిక దేశీయంగా తనకంటూ ఒక ప్రత్యేకమైన రికార్డును సృష్టించుకుంది. వివిధ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ వేదికల్లో అజేయంగా దూసుకుపోతూ ఇప్పటివరకు 23 స్వర్ణ పతకాలతో సహా మొత్తం 35 రాష్ట్ర స్థాయి మెడల్స్ సాధించి తన సత్తా ఏంటో నిరూపించుకుంది. ప్రవల్లికలోని ప్రతిభను గుర్తించి, ఆమెను అంతర్జాతీయ స్థాయికి చేర్చడంలో కీలక పాత్ర పోషించిన కోచ్‌లు, అకాడమీ నిర్వాహకులను కూడా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అభినందించారు.

**మొత్తం 16 పతకాలతో అదరగొట్టిన టీమిండియా**

చైనాలో జరిగిన ఈ ప్రతిష్టాత్మక ఆసియా అండర్-23 అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్లు ఓవరాల్‌గా తిరుగులేని ప్రదర్శన చేశారు. టోర్నమెంట్ ముగిసే సమయానికి భారత జట్టు మొత్తం 16 పతకాలతో తమ పర్యటనను ఘనంగా ముగించింది. ఇందులో 3 గోల్డ్, 4 సిల్వర్, 9 బ్రాంజ్ పతకాలు ఉన్నాయి. దేశం తరఫున పతకాలు సాధించి, త్రివర్ణ పతాకాన్ని చైనా గడ్డపై ఎగురవేసిన భారత క్రీడాకారులందరికీ, వారికి సహకరించిన సహాయక సిబ్బందికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




# ఇంగ్లాండ్ చిత్తు.. లార్డ్స్‌లో చరిత్ర సృష్టించిన టీమ్ఇండియా

భారత మహిళా జట్టు అద్భుతం చేసింది. లార్డ్స్‌లో జరిగిన మొదటి మహిళల టెస్టు మ్యాచ్‌లో టీమ్ఇండియా విజయం సాధించి చరిత్ర సృష్టించింది. భారత బౌలర్లు, బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో ఇంగ్లాండ్‌పై 270 పరుగుల భారీ తేడాతో గెలిచింది. టీమ్ఇండియా నిర్దేశించిన 457 పరుగుల లక్ష్య ఛేదనలో ఇంగ్లాండ్ 186 పరుగులకే ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 285 పరుగులు చేయగా.. ఇంగ్లాండ్ 170 రన్స్‌కే ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా 341/7 స్కోరు వద్ద డిక్లేర్డ్ చేసింది.

**ముందే డిసైడ్ అయిపోయింది..**

దాదాపు మూడో రోజే టీమ్ఇండియా విజయం ఖాయమైంది. ఓవర్ నైట్ 130/6 స్కోరుతో ఇన్నింగ్స్‌ను మొదలు పెట్టిన ఇంగ్లాండ్ నాలుగో రోజు తొలి సెషన్‌లోపే ఆలౌటైంది. అమీ జోన్స్ (54) అదనంగా మరో రెండు పరుగులు మాత్రమే జోడించింది. మ్యాడీ (24) వెంటనే ఔటైంది. అయితే, సోఫీ ఎకెల్‌స్టోన్ (50) కాసేపు పోరాడింది. ఓ వైపు వికెట్లు పడినా.. లోయర్ ఆర్డర్‌లో సోఫీ దూకుడుగా ఆడేసింది. ఓటమి వ్యత్యాసాన్ని మాత్రమే కాస్త తగ్గించగలిగింది. భారత బౌలర్లలో స్నేహ్ రాణా 4, సయాలీ 2, క్రాంతి గౌడ్ 2, దీప్తి శర్మ 2 వికెట్లు చొప్పున తీశారు.

**సచిన్, జైషా సందడి**




లార్డ్స్‌లో భారత మహిళా జట్టు తొలిసారి టెస్టు ఆడటంతో క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ హాజరయ్యారు. ఆయనతోపాటు ఐసీసీ ఛైర్మన్ జైషా కూడా మ్యాచ్‌ను వీక్షించారు. ఈ మ్యాచ్‌తో ఇంగ్లాండ్ క్రికెటర్లు టామీ బౌమొంట్, హీథర్ నైట్‌ల అంతర్జాతీయ కెరీర్ ముగిసింది. ఇప్పటికే వారు కెరీర్‌కు వీడ్కోలు చెప్పిన సంగతి తెలిసిందే.

లార్డ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో యస్తికా భాటియా (113) సెంచరీ సాధించింది. స్మృతి మంధాన రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అర్ధశతకాలు సాధించడం గమనార్హం.

టీమ్ఇండియా బౌలర్ క్రాంతి గౌడ్ లార్డ్స్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల ప్రదర్శన చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గానూ నిలిచింది. దీంతో సెంచరీ చేసిన యస్తికాతోపాటు క్రాంతి గౌడ్ ఆనర్స్ బోర్డులో పేరు లిఖించుకుంది.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com